బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 22 అక్టోబర్-2026

balagamtv100@gmail.com

పేజీలు-8

క్రెడిట్ కార్డు చెల్లింపులు ఆలస్యమైనా చార్జీల్లేవ్..



మిగతా 2లో..

తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు



మిగతా 4లో..

సీజేపీ నేతలు సౌరవ్, రాంకా విడుదల



వారంపాటు తీహార్ జైల్లో ఉన్న నేతలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18 : జంతర్ మంతర్ వద్ద ఈనెల 14న నిరసన తెలిపిన తర్వాత నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను విడుదల చేయాలని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్(ఎస్ఈఎం) బుధవారం ఆదేశించారు. తమ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వారు ఉపసంహరించుకున్న కొన్ని గంటల్లో విడుదల ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతరం బుధవారం రాత్రి వారు తీహార్ జైలు నుంచి విడుదల య్యారు. వారి కస్టడీ గడువు ముగియనున్న నేపథ్యంలో బుధవారం వారిద్దరినీ ఎస్ఈఎం ముందు హాజరుపరిచారు. నిరసన ప్రదేశంగా గుర్తింపును రద్దు చేసిన జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడంతోపాటు శాంతి ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించా రన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న దాస్, రాంకాలను ఈనెల 14న ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఈనెల 19న వారి కస్టడీ కాలాన్ని మరో రెండు రోజులు పొడిగించారు.

కాంగ్రెస్ పాపం పాలమూరుకు శాపం..

- రిజర్వాయర్లకు చేరని కృష్ణా నీళ్లు
- కేవలం 2.5 కి.మీ. కాలువ తవ్వని కారణంగా 5 రిజర్వాయర్లకు చేరని కృష్ణా నీళ్లు
- పాలమూరు-రంగారెడ్డిలో ఐదు భారీ రిజర్వాయర్లను నిర్మించిన కేసీఆర్ సర్కార్
- కృష్ణా నీళ్లు ఎత్తిపోసేందుకు పంప్‌హౌస్‌లు సైతం సిద్ధం
- కొసరు పనినీ చేపట్టని రేవంత్ సర్కార్ నిర్వాకంతో ఉన్న నీళ్లూ ఆంధ్రా పాలు



హైదరాబాద్, అక్టోబర్ 18 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ ఐఎస్)పై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతో ఉమ్మడి పాలమూరు జిల్లా కృష్ణా జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని దుస్థితి నెలకొన్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగు, తాగునీరందించేందుకు చేపట్టిన ఈ పథకం కోసం 5 భారీ రిజర్వాయర్లు సిద్ధంగా ఉన్నాయి. నడిపేందుకు పంపులూ రెడీగా ఉన్నాయి. కేవలం 2.5 కిలోమీటర్ల కాలువ పనులే పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులు పూర్తయి ఉంటే కృష్ణమ్మ ఉద్దండాపూర్ వరకూ చేరుకునేది. కొంతలో కొంతయినా

వివరాలు 4లో..

పోలీసు శాఖలో భారీ మార్పులు



- విధుల్లోకి 112 మంది కొత్త డీఎస్పీలు!
- కొలికి వచ్చిన ప్రమోషన్ల పంచాయితీ
- డీజీపీ చొరవతో వెనకి తగ్గిన సీనియర్లు
- ఈగల్, హైడ్రా, సైబర్ ప్రొబేషనరీ డీఎస్పీల సేవలు
- పోలీసు శాఖలో పదోన్నతుల సందడి
- 37 అదనపు ఎస్పీ పోస్టుల భర్తీకి ముమ్మర కసరత్తు

వివరాలు 3లో..

తాళ్లపేట కాంగ్రెస్‌లో మంటలు


- మళ్లీ ఘర్షణకు దిగిన ఇరువర్గాలు
- పోలీస్ పహారా ఉన్నా.. ఉద్రిక్తతలు
- ఎమ్మెల్యే-ఎంపీ వర్గీయుల ఢీ అంటే ఢీ
- దసరా రోజు పరస్పర దాడులు
- గాయపడిన

2లో..

ఎమ్మెల్యే వర్గీయులు

రాష్ట్రాలు ఒప్పుకొంటే 2029లో జమిలి ఎన్నికలు..!

- జేపీసీ చైర్మన్ పీపీ చౌదరి
- 22 బీజేపీ/ఎన్‌డీయే పాలిత రాష్ట్రాలు సుముఖం
- బిల్లు ఆమోదం పొందితే ఎన్నికలు సాధ్యమే
- జేపీసీ చైర్మన్ పీపీ చౌదరి



న్యూఢిల్లీ, అక్టోబర్ 18 : 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు అనేక రాష్ట్రాలలో జమిలి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఒక దేశం, ఒక ఎన్నికల కింద దీని సాధ్యాసా ధ్యాలను సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలిస్తున్నది. ఇప్పటివరకు 25 సమావేశాలను నిర్వహించిన జేపీసీ 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాథమిక పనులను పూర్తి చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లును పార్లమెంట్ ఆమోదించిన పక్షంలో 2029లో జమిలి ఎన్నికలను అమలు చేయడం కష్టమేమీ కాదని జేపీసీ చైర్మన్,బీజేపీ ఎంపీ పీపీ చౌదరి తెలిపారు.2028లో బిల్లు ఆమోదం పొందిన పక్షంలో ఆరు నెలల్లో సన్నాహాలు పూర్తి చేయాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. జమిలి ఎన్నికల ద్వారా రూ.7 లక్షల కోట్లు ఆదా చేయవచ్చని ప్రభుత్వం వాదిస్తున్నది. అయితే, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) ఎస్‌వై ఖురేషీ అభిప్రాయం

వివరాలు 4లో..

ఎప్‌స్టీన్‌తో హర్దీప్ రహస్య సమావేశం..!

- ఫొటోలు బయటకు రావడంతో రాజకీయ దుమారం
- లైంగిక నేరస్థుడితో భేటీపై వివరణ ఇవ్వాలని విపక్షాల డిమాండ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 18 : దోషిగా తేలిన లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ జరిపిన ప్రైవేట్ సమావేశాలపై ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిం చారు. ఎప్‌స్టీన్, పురీ సమావేశం ఫొటోలను పంచు ఓకున్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ(ఎస్‌పీ)కి చెందిన నాయకులు ఆ సంభాషణల గురించి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను ఎప్‌స్టీన్‌ను ఒక ప్రతినిధి బృందంలో భాగంగానే కలిశానని, వ్యక్తిగత హోదాలో కాదని గతంలో పురీ చేసిన ప్రకటనను ఉద్దేశించి విపక్ష నాయకులు ఆ యనను లక్ష్యంగా చేసుకున్నారు.తాను ఎప్‌స్టీ న్‌ను ఎప్పు డూ ఒంటరిగా (ముఖా ముఖీగా) కలవలేదని పురీ చేసిన

వివరాలు 4లో..

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య



- పంటలకు నీరందక.. పెట్టుబడులు చేతికి రాక
- మానుకోట, నల్లగొండ జిల్లాల్లో ఇద్దరి బలవన్మరణం

వివరాలు 3లో..

ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం..



గ్రాప్-1 ఆంక్షలు అమలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18 : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీతోపాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) పరిధిలో గ్రాప్ 1 (గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్) ఆంక్షల్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇప్పటికీ ఢిల్లీలో వాయు కాలుష్య నాణ్యత పూర్ కేటగిరిలో ఉంది. బుధవారం ఉదయం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 223గా నమోదైంది.వాయు కాలుష్యం పెరగడం, ప్రజలు శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రాప్ ఆంక్షల్ని అమలు చేయాలని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీని ప్రకారం ప్రజలు వాయు కాలుష్యానికి కారణమయ్యే కొన్ని చర్యల్ని ఆపేయాల్సి ఉంటుంది. గ్రాప్ 1 ప్రకారం.. ఢిల్లీలోని రెస్టారెంట్లు, హోటళ్లు, ఇతర చోట్లా ఎక్కడా వంట కోసం బొగ్గును వాడకూడదు. డీజిల్ జనరేటర్లను కూడా అత్యవసర పరిస్థితుల్లో తప్ప వాడరాదు.మరోవైపు ఢిల్లీలో ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి. ఇది సగటు కంటే తక్కువ. సీపీసీబీ డాటా ప్రకారం.. ఏక్యూఐ 0 నుంచి 50 వరకు ఉండొచ్చు. దీన్ని గుడ్ కేటగిరిగా చెబుతారు. ఆ తర్వాత 51-100 వరకు ఉంటే శాటిస్ఫ్యాక్టరీగా, 101-200 ఉంటే మోడరేట్, 201-300 ఉంటే పూర్, 301-400 ఉంటే వెరీ పూర్, 401-500

వివరాలు 4లో..

తుది దశలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం



గత ఒప్పందాలకు ఇది భిన్నం: ట్రంప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 18 : అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే దశకు చేరుకున్నాయని, ఈ ఒప్పందం గతంలో కుదుర్చుకున్నవాటి కంటే భిన్నంగా ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. మంగళవారం ఓవల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడం పట్ల రెండు దేశాలు ఆసక్తిగా ఉన్నాయని అన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారతదేశ పర్యటనకు వచ్చిన తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఏపీలో మున్సి'పోల్స్'కు బ్రేక్



- తాత్కాలికంగా 100 మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిలిపివేత
- సుప్రీం ఆదేశాలతో ఎస్ఈసీఅనిల్‌చంద్ర పునేఠా ప్రకటన
- అభ్యర్థుల తుది జాబితా ప్రకటన 25 వరకు వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబర్ 18 : ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. ఈ ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా ప్రకటించారు. మొత్తంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్టు ఎస్ఈసీ తెలిపారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ముందుకు వెళ్లనున్నట్టు చెప్పారు. సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు వచ్చాక గురువారం ఉత్తర్వులు జారీచేయనున్నట్టు వెల్లడించారు.ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు గడువును పొడిగించాలన్న వైసీపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. తమ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని వైసీపీ ఆ పిటిషన్‌లో పేర్కొన్నది. దీనిపై విచారణ సందర్భంగా జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహన్ ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియకు రాజ్యాంగ

వివరాలు 4లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

క్రెడిట్ కార్డు చెల్లింపులు ఆలస్యమైనా చార్జీల్లేవ్..



యూజర్లకు ఆర్బీఐ ఊరట

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: క్రెడిట్ కార్డుదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గొప్ప ఊరట నిచ్చింది. చెల్లింపులు ఆలస్యమైనా చార్జీలు పడకుండా కొత్త నిబంధనల్ని తెచ్చింది. సవరించిన రూల్స్ ప్రకారం.. గడువు తేదీ 2-3 రోజులు దాటినా ఓవర్ డ్యూగా పరిగణించబడదు.చెల్లింపు గడువు తేదీ దాటి 3 రోజులైనా చెల్లింపులు జరుపకపోతేనే లేట్ పేమెంట్ చార్జీలు వేయాలని, సిబిల్ తదితర క్రెడిట్ బ్యూరోలకు సదరు ఖాతాను గడువు దాటినదిగా నివేదించాలని బ్యాంకర్లకు ఆర్బీఐ స్పష్టం చేసింది.ఆలస్యపు చెల్లింపు ఫీజును మొత్తం బిల్లుపై కాకుండా గడువు తేదీ మించిన తర్వాత మిగిలిన మొత్తాలపై లెక్కించి మాత్రమే విధించాలని పేర్కొన్నది.ఫీజుల్లో ఏవైనా తేడాలు చేయాలనుకుంటే కస్టమర్లకు కనీసం 30 రోజుల ముందే తెలియజేయాలి.కార్డును మూసివేయాలన్న విజ్ఞప్తులను 7 రోజుల్లోగా పరిష్కరించాలి. లేకపోతే రోజుకు రూ.500 చొప్పున కస్టమర్‌కు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.కస్టమర్ ఫిర్యాదును బ్యాంకులు 30-60 రోజుల్లోగా పరిష్కరించాలి. లేనిపక్షంలో కస్టమర్లకు ఆర్బీఐ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించవచ్చు.వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి.

'సర్' వ్యతిరేక నిరసనలో పరకాల ప్రభాకర్



న్యూఢిల్లీ, అక్టోబర్ 21: సర్ పేరుతో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు నిరసనగా 'హర్ గలీ మే జంతర్ మంతర్' (ప్రతి వీధిలోనూ ఒక జంతర్ మంతర్) పేరుతో ఈ నెల 23న జరిపే దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ పాల్గొననున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, నటుడు ప్రకాశ్ రాజ్, సీనియర్ అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్, రైతు నేత రాకేశ్ టికాయత్, ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా, రచయిత తుషార్ గాంధీలతో ఆయన వేదికను పంచుకుంటారు.

ఈ ఆందోళనలో పాల్గొనాలని ఇండియా కూటమికి ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. అయితే వారి నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదని సీజేపీ వర్గాలు తెలిపాయి. జంతర్ మంతర్‌లో నిరసనలు చేపట్టరాదంటూ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈ నెల 23న దేశవ్యాప్తంగా ఎక్కడ ఉన్నవారు అక్కడే జాతీయ జెండాలు చేతబట్టి సర్‌పై నిరసన చేపట్టాలని సీజేపీ పిలుపునిచ్చింది.

దసరా వేళ సీతారాంబాగ్‌లో ప్రత్యేక కటౌట్లు



- ఆసక్తిగా వీక్షించిన హైదరాబాద్ నగరవాసులు

హైదరాబాద్, అక్టోబర్ 18 : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే విజయదశమి వేడుకల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకున్నది. హైదరాబాద్‌లోని సీతారాంబాగ్ గ్రౌండ్స్‌లో దసరా పండుగ సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన 'శ్రీరా ముడిగా కేసీఆర్.. రావణుడిగా రేవంత్‌రెడ్డి' కటౌట్ అందరి దృష్టిని ఆకర్షించింది. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శ్రీరాముడి ఆదర్శాలతో పోల్చుతూ ఏర్పాటుచేసిన కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్న కేసీఆర్ నాయకత్వాన్ని, ఆయన అందించిన పాలనా దక్షతను ఆయన అభిమానులు ఈ సందర్భంగా కొనియాడారు. ఇదే సందర్భంలో కటౌట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రావణుడిగా రూపొందించడం గమనార్హం. ఈ వేడుకకు నగరవాసులు పెద్ద సంఖ్యలో తరలిరాగా ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగాయి.

23 నుంచి దేశవ్యాప్త కార్యక్రమాలు

- ఇండీ కూటమి ప్రచారాన్ని తిప్పికొడుతాం: ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్, అక్టోబర్ 18 : విదేశీ నిధులతో దేశంలో తీవ్రమైన అరాచకం సృష్టించేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో జరుగుతున్న ఆందోళనలు కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశభద్రత, ప్రయోజనాలు ఎలా ఉన్నా అధికారమే పరమావధి అన్నట్టుగా రాహుల్‌గాంధీ తీరు మారిందని మండిపడ్డారు. ఇండీ కూటమి చేసున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ఈ నెల 23 నుంచి నవంబర్ 5 వరకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, విపక్షాల అసలు నైజాన్ని ప్రజల ముందు ఎండగడతామని అన్నారు. ఆధారాలు లేకుండా కేవలం బురదజల్లే రాజకీయాలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

పాలపిట్టను పట్టుకున్నందుకు నాలుగుచోట్ల కేసు నమోదు

- ఉప్పల్ రావణ దహనంలో పాలపిట్టను పట్టుకున్న పీసీసీ చీఫ్
- స్థానిక నేతలపై కేసు.. మహేశ్‌గౌడ్‌ను తప్పించిన అధికారులు
- సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న విమర్శలు



హైదరాబాద్, అక్టోబర్ 18 : చట్టం.. అధికార పార్టీకి చుట్టంగా మారుతున్నదా?.. రాష్ట్రంలో పోలీసుల తీరు చూస్తుంటే అలానే అనిపి స్తున్నది. దసరా సందర్భంగా రాష్ట్ర పక్షి పాలపిట్టను పంజరాల్లో బంధించడం, హింసించడం సరైంది కాదని, అటువంటి వారి సమాచారమిస్తే కేసులు పెడుతామంటూ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రకటించారు. రెండురోజులుగా పాలపిట్ట విషయంలో హైదరాబాద్ సిటీ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ.. నాలుగుచోట్ల పంజరంలో ఉన్న పక్షులను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.అటవీశాఖ పాలపిట్టను హింసించవద్దంటూ పోస్టర్లు ముద్రించి ప్రచారం చేసింది. పాలపిట్టలను పంజరంలో బంధించడాన్ని నివారించాలని, ఆలయాల్లో కూడా ఈ నిబంధన పాటించేలా చూడాలని ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి వినయ్ కుమార్ అధికారులను కొద్ది రోజుల క్రితమే ఆదేశించారు. పాలపిట్టను బంధిస్తే సెక్షన్ 51(1) కింద మూడేండ్ల జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారని అధికారులు హెచ్చరించారు. అయితే దసరా సందర్భంగా ఉప్పల్ మినీస్టేడియంలో మంగళవారం జరిగిన రావణదహన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పాలపిట్టను చేతిలో పట్టుకుని ఉన్న వీడియో దుమారం రేపుతున్నది.పండుగ ఆచారాలంటూ ఈ పక్షిని హింసించవద్దంటూ అటవీశాఖ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వేర్వేరుగా హెచ్చరించినప్పటికీ ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలో మహేశ్‌గౌడ్ సమక్షంలోనే పాలపిట్టను పంజరంలో పెట్టి వేదికపైకి తీసుకురావడం, ఆ తర్వాత ఆ పక్షిని ఆయన చేతికి ఇస్తే దానిని పట్టుకోవడం కనిపించింది. కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేస్తున్నపుడు ఆయన పక్షిని అటూ ఇటూ కదిలిస్తూ హింసించినట్టుగా ఉండడంతో ఈ వీడియో వివాదాస్పదమైంది. మహేశ్‌గౌడ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఉప్పల్ మినీ స్టేడియంలో పాలపిట్టను విడుదల చేసిన ఘటనకు సంబంధించి ఉప్పల్‌కు చెందిన ఈగ చంద్రశేఖర్, పీ పరమేశ్వర్‌రెడ్డి, మరికొందరి ప్రమేయం ఉన్నట్టుగా ప్రాథమికంగా గుర్తించినట్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అటవీ అధికారి వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సంబంధిత సెక్షన్లతో పాటు బీఎన్ఎస్ సెక్షన్ 35 కింద వారిపై కేసు నమోదు చేశారు.ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ జరుగుతున్నదని, విచారణ పూర్తయిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని, నిందితులను సంబంధిత మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కీలకమైన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పేరు లేకుండానే అటవీ అధికారులు కేసు నమోదు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారపార్టీ నేత అయి ఉండి ప్రభుత్వశాఖలు చెప్పిన సూచనలు పాటించకుండా, వన్యప్రాణులను హింసించే రీతిలో వ్యవహరించినప్పటికీ మహేశ్‌గౌడ్‌ను ఎందుకు వదిలేశారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

తాళ్లపేట కాంగ్రెస్‌లో మంటలు

- మళ్లీ ఘర్షణకు దిగిన ఇరువర్గాలు
- పోలీస్ పహారా ఉన్నా.. ఉద్రిక్తతలు
- ఎమ్మెల్యే-ఎంపీ వర్గీయుల ఢీ అంటే ఢీ
- దసరా రోజు పరస్పర దాడులు
- గాయపడిన ఎమ్మెల్యే వర్గీయులు



దండేపల్లి, అక్టోబర్ 21 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేటలో కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణలు చల్లారడం లేదు. సద్దుల బతుకమ్మ రోజు జరిగిన గొడవను మరువక ముందే దసరా పండుగ రోజు మరోసారి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జిల్లా స్థాయి పోలీసు అధికారులు, సీఐలు, ఎస్సైలతోపాటు భారీగా పోలీసు సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేసినా ఎమ్మెల్యే-ఎంపీ వర్గీయులు ఢీ అంటే ఢీ అంటున్నారు. ఇరువర్గాల నాయకులు ఏ మాత్రం తగ్గకపోవడంతో తాళ్లపేట విషయం పోలీసులకు సవాల్‌గా మారింది.దసరా పండుగ రోజు జరిగిన దాడుల్లో ఎమ్మెల్యే వర్గానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. తాళ్లపేటకు చెందిన పేరం రజిత, ఆకుల రాజేంద్రప్రసాద్, ఆకుల అకిరానందన్ జమ్మికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఆకుల కిరణ్‌కుమార్, రాజేందర్, సురేశ్, విజయవర్ధన్, ముత్తె కుమారస్వామి, ఎర్రం మల్లేశ్ వారి ఇంట్లోకి ప్రవేశించి, అసభ్య పదజాలంతో దూషిస్తూ కర్రలతో దాడులు చేశారు. ఈ దాడిలో ఆకుల రాజేంద్ర ప్రసాద్, అకిరానందన్ తలలకు, పేరం రజిత చేతికి గాయాలయ్యాయి.ఈ ఘటనపై పోలీసులు ఆకుల కిరణ్, సురేశ్, విజయ్‌వర్ధన్, ఎర్రం మల్లేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. కాగా తాళ్లపేటలో గాయపడిన వారిని మంచిర్యాలలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. ఈ ఘటన నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో పోలీసులు భారీగా మోహరించారు. ఎంపీ ప్రధాన అనుచరుడు మంతెన జగన్‌మోహన్‌రావు అరెస్టుకు రంగం సిద్ధమైందంటూ ఓ వైపు ప్రచారం జరిగింది. మరో వైపు పీఎస్ఆర్ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు.. జగన్‌మోహన్‌రావు ఇంటిపై దాడికి పాల్పడే అవకాశం ఉన్నదన్న సమాచారంతో అప్రమత్తమైనట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి.

ఎల్లూరు రిజర్వాయర్‌కు నీళ్లు

- నాటి బీఆర్ఎస్ చర్యల ఫలితమే నేటి జలకళ
- మూడేండ్ల నుంచి పాలమూరు పనులు ఆపిందెవరు?
- మంత్రి జూపల్లి సవాల్‌కు సిద్ధం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 18 : పాలమూరు -- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు సాగునీరు రావడం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాల ఫలితమేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు విడుదల చేసిన తూము, తాను నాడు కేసీఆర్‌ను కోరి పెట్టించడం వల్లే ఏర్పాటయిందని గుర్తుచేశారు. ఈ పథకానికి సంబంధించి సాగునీటి అంశాలపై మంత్రి జూపల్లి విసిరిన సవాల్‌కు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. గతంలో కాంగ్రెస్ చేసిన అన్యాయాలను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సరిదిద్దిందని పేరొన్నారు.ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో పుష లంగా నీరు ఉన్నందున, ప్రభుత్వం ప్యాకేజీ 3లో అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగించి వెంటనే నీటిని పారించాలని డిమాండ్ చేశారు. ప్రతి రిజర్వాయర్‌లో 5 టీఎంసీల నీటిని నింపే వీలుందని, మిగిలిన పనులను వచ్చే ఏడాదికల్లా పూర్తి చేయవచ్చని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి పాలమూరు -- రంగా రెడ్డి పనులను ఉద్దేశపూర్వకంగా ఆపుతున్నదని, గతంలో ఇచ్చిన కాలువల టెండర్లను ఎందుకు రద్దు చేశారో సమాధా నం చెప్పాలని ప్రశ్నించారు. రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదని, ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని హితవు పలికారు.

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మద్దూర్‌లో పర్యటన



మద్దూర్, అక్టోబర్ 21 : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మద్దూర్ పర్యటనలో ఓ మహిళా రైతు అడిగిన ప్రశ్న ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో హాట్‌టాపిక్ గా మారింది. మంగళవారం ఆయన నారాయణపేట జిల్లా మద్దూర్‌కు వెళ్తూ.. దోరేపల్లిలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యేను చూసిన మహిళా రైతు బుగ్గమ్మ అక్కడికి వచ్చి.. 'మళ్లీ కేసీఆర్ సారు ఎప్పుడొస్తరు సారూ? ఇంకా ఎన్ని రోజులు ఇలా బతుకాలి?' అంటూ దీనంగా ప్రశ్నించింది.మరో రెండేండ్లలో కేసీఆర్ సారు మళ్లీ సీఎం అవుతారని, అప్పటి నుంచి మళ్లీ మంచి రోజులొస్తాయని బదులివ్వగా.. 'ఇంకా రెండేం ట్లా?' అంటూ బుగ్గమ్మ నిట్టూర్పు విడిచింది. అనంతరం పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల దీనస్థితిని చూసి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి కొడంగల్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, ఎండిపోయిన ప్రతి ఎకరాకూ రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ కాస్టుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు

- రామప్ప ఆలయ పరిరక్షణ అందరి బాధ్యత
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ములుగు రూరల్, అక్టోబర్ 21 : ములుగు జిల్లా వెంకటాపూర్ శివారులో సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గనికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఆమె రామప్ప దేవాలయాన్ని సందర్శించగా.. బొగ్గు తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండా రామప్ప ఆలయాన్ని పరిరక్షించాలని రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ అకిరెడ్డి రామ్మోహన్ రావు మంత్రికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వారసత్వ సంపదైన రామప్ప ఆలయాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని, దానికి ముప్పు వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త వహిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎవరూ అధైర్య పడొద్దని, ఆలయ పరిసరాల్లో ఎలాంటి తవ్వకాలు చేపట్టకుండా అధికారులతో సమావేశమై చర్చిస్తానని తెలిపారు. పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక లేకుండా ఎలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడం లేదని స్పష్టంచేశారు.

కేసీఆర్ నివాసంలో ఘనంగా దసరా వేడుకలు

- కుటుంబ సమేతంగా ఆయుధ, శమీ పూజ



హైదరాబాద్, అక్టోబర్ 21 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో మంగళవారం విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. పండుగను పురసరించుకొని వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆయన నివాస ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. ఈ సందర్భంగా కేసీఆర్ వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన కుమారుడు హిమాన్షు, కేసీఆర్ సతీమణి శోభమ్మ, కోడలు శైలిమ పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో కేసీఆర్ శమీ వృక్షానికి(జమ్మి చెట్టు) ప్రత్యేక పూజలు గావించారు. తన నివాసానికి విచ్చేసిన బంధువులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలిజేసి ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, పార్టీ నాయకులు జహంగీర్, జుబేర్, కేసీఆర్ పీఎస్ నాగేందర్ రెడ్డితోపాటు కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.

అర్హులైన పేదలకు ఇండ్లు ఇవ్వాలి



- నేడు కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ పోరుబాట
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, అక్టోబర్ 21 : ఖమ్మం జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హకులను పరిరక్షించాలనే డిమాండ్లతో వామపక్ష పార్టీలతో కలిసి గురువారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటలకు భారీ ధర్నా నిర్వహిస్తున్నట్టు బీఆర్ఎస్ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. బుధవారం ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజుతో కలిసి మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేదని, కానీ నేడు గ్రామసభ తీర్మానం లేకుండా, ఇందిరమ్మ కమిటీల పేరుతో సొంత పార్టీ ప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. సర్పంచులు, వార్డు సభ్యుల హకులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలంతా అందినకాడికి దోచుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులు లాటరీ పద్ధతిలో పారదర్శకంగా జరుపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులతో కూడిన ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి, సర్పంచులు ఇచ్చిన జాబితాను ఫైనల్ చేయాలని కోరారు.

రేవంత్‌కు సొంతూరులోనే చేదు అనుభవం



- 'డిండి' రద్దు చేయాలని ఫ్లెక్సీతో నిరసన ప్రదర్శన

కల్వకుర్తి, అక్టోబర్ 21 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డిండి ప్రాజెక్టు నిర్వాసితుల నుంచి సొంతూరులోనే చేదు అనుభవం ఎదురైంది. డిండి ప్రాజెక్టు ఎత్తేసి గోకారం, ఎర్రవల్లి నిర్వాసితులను కాపాడాలని కోరుతూ ఓ యువకుడు రేవంత్‌రెడ్డి ఎదురుగా ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన తెలిపిన ఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డిపల్లిలో చోటుచేసుకున్నది. దసరా ఉత్సవాల్లో పాల్గొనేందుకు మంగళవారం మధ్యాహ్నం తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో తన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లికి వచ్చారు.హెలిప్యాడ్ నుంచి తన ఇంటి వరకు వచ్చేందుకు టాప్‌లెస్ జీపులో ఎక్కి ర్యాలీగా వస్తున్న క్రమంలో ఓ యువకుడు ర్యాలీలో రేవంత్‌రెడ్డికి ఎదురుగా నిలబడి ఫ్లెక్సీని ప్రదర్శించారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయడమే కాకుండా, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వేగంగా పూర్తి చేయాలని, డిండి నిర్వాసితులను ఆదుకోవాలనే డిమాండ్‌తో ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న క్రమంలో.. ఏకంగా ముఖ్యమంత్రి సొంతూరులో రేవంత్‌రెడ్డి ఎదురుగానే ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన తెలుపడం చర్చనీయాంశమైంది.

పోలీసు శాఖలో భారీ మార్పులు

- విధుల్లోకి 112 మంది కొత్త డీఎస్పీలు!
- కొలికి వచ్చిన ప్రమోషన్ల పంచాయితీ
- డీజీపీ చొరవతో వెనకి తగ్గిన సీనియర్లు
- ఈగల్, హైడ్రా, సైబర్ ప్రొబేషనరీ డీఎస్పీల సేవలు
- పోలీసు శాఖలో పదోన్నతుల సందడి
- 37 అదనపు ఎస్పీ పోస్టుల భర్తీకి ముమ్మర కసరత్తు



హైదరాబాద్, అక్టోబర్ 21 : రాష్ట్ర పోలీసు శాఖలో భారీ మార్పులకు రంగం సిద్ధమైంది. అకాడమీలో కఠిన శిక్షణ పూర్తిచేసుకున్న 112 మంది నూతన డీఎస్పీలు త్వరలోనే ప్రొబేషనరీ అధికారులుగా విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం వీరు గ్రేహౌండ్స్‌తో పాటు ఇతర కీలక విభాగాల్లో అంతర్గత క్షేత్రస్థాయి శిక్షణ పొందుతున్నారు. చాలాకాలంగా డీఎస్పీ స్థాయి పోస్టుల నేరుగా భర్తీ జరుగకపోవడంతో శాఖలో తీవ్రమైన సిబ్బంది కొరత ఏర్పడింది.ఈ కొత్త అధికారుల రాకతో పోలీసు విభాగానికి భారీ ఊరట లభించనున్నది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కీలక విభాగాలకు ఈ యువ అధికారుల నియామకం ద్వారా సరికొత్త బలం చేకూరనున్నది. ముఖ్యంగా సైబర్ నేరాలను అరికట్టేందుకు ఏర్పాటైన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఆక్రమణల నియంత్రణ కోసం తెచ్చిన హైడ్రా, అలాగే మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక విభాగమైన ఈగల్ వంటి విభాగాల్లో సమర్థులైన అధికారుల అవసరం ఉన్నది. క్షేత్రస్థాయి పరిశోధనలు వేగం కావడానికి ఈ 112మంది డీఎస్పీల నైపుణ్యం ఎంతగానో ఉపయోగపడనున్నది. మరోవైపు సుదీర్ఘ కాలంగా నలుగుతున్న 1995, 1996 బ్యాచ్ డీఎస్పీల ఉద్యోగోన్నతుల వివాదం ఎట్టకేలకు కొలికి వస్తున్నది. గతంలో ఒకే విడుతలో 140మందికి సూపర్ న్యూమరరీ పోస్టుల కింద ప్రమోషన్లు కల్పించడంతో సీనియారిటీ సమస్యలు తలెత్తాయి. దీంతో రెండు బ్యాచ్‌ల మధ్య వివాదాలు మొదలై న్యాయస్థానాల వరకు వెళ్లాయి. ఫలితంగా ఏండ్ల తరబడి అర్హులైన అధికారులకు ప్రమోషన్లు దకక తీవ్ర నైరాశ్యం నెలకొంది.ఈ చికుముడిని విప్పేందుకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇటీవల ఆయన రెండు బ్యాచ్‌ల అధికారులతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపారు. కోర్టు కేసులను ఉపసంహరించుకుంటే సర్వీస్ నిబంధనలకు లోబడి అందరికీ సమన్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ హామీతో సానుకూలంగా స్పందించిన పలువురు అధికారులు తమ న్యాయపోరాటా లను విరమించుకునేందుకు అంగీకరించడంతో సమస్య పరిషారానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం పోలీసు యంత్రాంగంలో 37అదనపు ఎస్పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీఎస్పీల ప్రమోషన్ల వివాదం సద్దుమణుగుతుండటంతో ఆ స్థానాల భర్తీకి ఉన్నతాధికారులు ముమ్మర కసరత్తు ప్రారంభించారు. డీఎస్పీలుగా ఉన్న సీనియర్లకు అదనపు ఎస్పీలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తే, ఆ స్థానాల్లో కిందిస్థాయి అధికారులైన సీఐలకు డీఎస్పీలుగా అవకాశాలు దక్కుతాయి. ఈ ప్రక్రియ క్రమబద్ధంగా సాగితే నాన్ క్యాడర్ ఎస్పీల వరకు కీలక ఖాళీలన్నీ భర్తీ అవుతాయి.ఈ బదిలీలు, ప్రమోషన్ల పరంపర పూర్తిస్థాయిలో అమలైతే రాష్ట్రవ్యాప్తంగా పోలీసు పాలన మరింత చురుగ్గా మారనున్నది. జిల్లాలు, కమిషనరేట్లలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా సాగుతాయి. కొత్త రక్తంతో కూడిన ప్రొబేషనరీ డీఎస్పీలు, అనుభవజ్ఞులైన అదనపు ఎస్పీల నాయకత్వంతో నాణ్యమైన సేవలు అందుతాయని భావిస్తున్నారు.

రాజన్న ఆలయ అధికారులకు నోటీసులు!

లీజు, లైసెన్స్‌ల జారీలో తప్పిదాలే కారణం

వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం



వేములవాడ, అక్టోబర్ 21: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించి లీజులు, లైసెన్స్‌ల జారీలో లోటుపాట్లు, శాఖాపరమైన తప్పిదాలపై ఆ విభాగానికి చెందిన తొమ్మిది మంది అధికారులు, ఉద్యోగులకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెం ట్ తాజాగా నోటీసులు జారీ చేసినట్టు తెలిసిం ది. వేములవాడ భీమేశ్వరాలయంలో ఆగస్టు 17న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తొమ్మిది గంటలపాటు విస్తృత తనిఖీలు చేసి, పలు తప్పిదాలను గుర్తించి, రికార్డులను స్వా ధీనం చేసుకున్నది. 2024 నుంచి ఇప్పటివరకు స్వామివారికి బకాయి పడిన నగదు వసూళ్లలో జాప్యం, ఒకేసారి మూడేండ్ల అద్దె ను కొనసాగించడం, బినామీల పేరిట వచ్చినవారికి అద్దె దుకాణాలను కేటాయించినట్టు గుర్తించి ఆ విభాగానికి చెందిన ఏఈవో నుంచి పర్యవేక్షకులు, జూనియర్ అసిస్టెంట్ వరకు తొమ్మిది మంది ఉద్యోగులు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.ఇందులో ఇప్పటికే బదిలీ అయిన యాదగిరిగుట్ట ఉద్యోగులతోపాటు రిటైర్ అయిన వారు కూడా హాజరు కావాలని ఆదేశించడం ఆలయ వర్గాల్లో ఆందోళన కలిగిస్తున్నది. గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ముందు అధికారు లు, ఉద్యోగులు హాజరుకానున్నట్టు తెలిసిం ది. అద్దె పొందిన దుకాణాల యజమానుల గడువు వచ్చే జనవరి 2027 నాటికి ముగుస్తుండటం, నేటికీ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా నష్టం చేకూరుతున్నట్టుగా విజిలెన్స్ శాఖ భావిస్తున్నట్టుగా తెలుస్తున్నది. ఒకేసారి తొమ్మిది మంది ఉద్యోగులకు నోటీసులు జారీ చేయడం ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తున్నది.

ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ కూటమి విజయం



- అధికారికంగాఎన్నికల ఫలితాలు విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 21 : టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల ఫలితాలు అధికారికంగా వెలువడ్డాయి. ఇందులో అత్యధిక ఓట్లు సాధించిన ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)ను రాష్ట్ర గుర్తింపు సంఘంగా కార్మిక శాఖ ప్రకటించింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ ఎండీకి అధికారిక లేఖ పంపింది. ఈయూకు మొత్తం 18,276 ఓట్లు రాగా.. రెండోస్థానంలో నిలిచిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌కు 13,556 ఓట్లు వచ్చాయి. మెజారిటీ యూనియన్‌ను గుర్తించేందుకు కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ రిటర్నింగ్ ఆఫీసర్‌ను నియమించి ఈ ప్రక్రియ చేపట్టారు. ఆర్టీసీ సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్ (15), బహుజన వర్కర్స్ యూనియన్(320), కార్మిక సంఘ్(193), బహుజన కార్మిక యూనియన్ (259), టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (35), తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(1315), చెల్లని ఓట్లు 130 కలిపి మొత్తం 34,421 ఓట్లు పోలైనట్టు తెలిపారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ ఆర్టీసీకి జారీచేసిన ఉత్తర్వుల్లో ఆదేశించింది. ఎంప్లాయీస్ యూనియన్‌కు రెండేండ్ల పాటు గుర్తింపు వర్తిస్తుందని పేర్కొంది.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- పంటలకు నీరందక.. పెట్టుబడులు చేతికి రాక
- మానుకోట, నల్లగొండ జిల్లాల్లో ఇద్దరి బలవన్మరణం



హైదరాబాద్, అక్టోబర్ 21 : ఓ వైపు పంటలకు నీరందక.. పెట్టుబడులు చేతికి రాక.. మరోవైపు అప్పుల భారం పెరిగి ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాదకర ఘటనలు మహబూబాబాద్, నల్లగొండ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. బాధిత కుటుంబాల సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన రైతు బొమ్మెర మహేందర్ (42) తనకున్న ఐదెకరాలతోపాటు మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు.పంటలకు సరిపడా నీరు అందకపోవడంతో బావి తవ్వించేందుకు సుమారు రూ.7 లక్షలు అప్పు చేశాడు. బోరులో నీటిమట్టం తగ్గిపోయింది. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం కారణంగా పంటలకు నీరు అందించలేకపోయాడు. వరి పంట నీరు లేక ఎకడికకడ బీటలు వారి ఎండిపోయింది. ఓవైపు బావి తవ్వకానికి చేసిన రూ.7 లక్షల అప్పు, మరోవైపు కౌలుకు తీసుకున్న 15 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోవడంతో చేతికి రూపాయి కూడా వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో దసరా పండుగ రోజు మహేందర్ పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్ట గ్రామానికి చెందిన కౌలు రైతు దొడ్డి సాగర్ (36) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆగా మోత్కూరు శివారులో ఎకరం 30 గుంటల్లో పత్తి, మునుకుంట్ల శివారులో సుమారు 6 ఎకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాడు. అదేవిధంగా మునుకుంట్ల శివారులో లీజు పద్ధతిలో కోళ్ల ఫారాన్ని నిర్వహిస్తున్నాడు. ఇందుకోసం రూ.50 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు చెల్లించే పరిస్థితి లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 18న గడ్డిమందు తాగి ఇంట్లో పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సాగర్ భార్య దివ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వరుసగా రివర్‌బోర్డుల సమావేశాలు

26న కేఆర్ఎంబీ.. 30న జీఆర్ఎంబీ

హైదరాబాద్, అక్టోబర్ 21 : కృష్ణా, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుల సమావేశాలు వరుసగా కొనసాగనున్నాయి. ఈ నెల 26వ తేదీన కేఆర్ఎంబీ 21వ బోర్డు మీటింగ్ కొనసాగనుండగా, 30వతేదీన జీఆర్ఎంబీ 18వ బోర్డు మీటింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే ఇరు రాష్ట్రాలకు ఆయా బోర్డులు సమాచారం ఇవ్వడంతోపాటు, మీటింగ్ ఎజెండాలను సైతం పంపాయి. ప్రధానంగా కేఆర్ఎంబీ మీటింగ్‌లో నీళ్లవాటా అంశంపై చర్చ కొనసాగనున్నది. ఇరు రాష్ట్రాలు ఏ నిష్పత్తిలో జలాలు వినియోగించుకోవాలనే అంశంపై చర్చ కొనసాగనున్నది. అదేవిధంగా ఇరు బోర్డుల నిర్వహణకు చెల్లించాల్సిన నిధులపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. సమావేశాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సెక్రటరీలు, ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొననున్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పాపం పాలమూరుకు శాపం..

పాలమూరు జిల్లాకు ఉపశమనం లభించేది. కానీ, కేవలం కాంగ్రెస్ సర్కార్ వైఫల్యంతో కృష్ణా జలాలు ఏపీకి తరలిపోయాయి. మూడేండ్లుగా కొద్దిపాటి కాలువ పనులను పూర్తిచేయని కాంగ్రెస్ వైఫల్యం ఇప్పుడు ఉమ్మడి జిల్లాకే శాపంగా పరిణమించింది. కృష్ణా జలాలను వినియోగించుకోలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతూ ఇప్పుడు కరువుబారిన పడింది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, జడ్చర్ల, కల్వకుర్తి, అచ్చంపేట, పరిగి, వికారాబాద్, తాండూరు, చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని 70 మండలాల్లో 1,546 నీటికుంటలు, చెరువులను నింపాలన్నది ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీటిని అందించాలన్నది లక్ష్యం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లోనే శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టు పనులను మొత్తంగా 21 ప్యాకేజీలుగా విభజించి, అందులో 18 ప్యాకేజీల పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం నాడే చేపట్టింది. బీఆర్ఎస్ అధికారంలోంచి దిగిపోయేనాటికి నార్లాపూర్-ఏదులకు నీటిసరఫరా చేసే 8.32 కి.మీ. ప్రధాన కాలువలో దాదాపు 4.95 కి.మీ. పూర్తయింది. కేవలం 3.82 కి.మీ. మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా నీటి సరఫరా వ్యవస్థ మొత్తాన్ని గత కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసి పెట్టింది. సూటిగా చెప్పాలంటే 'ఏనుగు ఎల్లింది తోక చిక్కింది' అన్నట్టుగానే పనులు మిగిలి ఉన్నాయి. తాగునీటి సరఫరా పనులు పూర్తయ్యే దశలోనే దాదాపు రూ.10 వేల కోట్లతో సాగునీటి కాలువల తవ్వకానికి సైతం బీఆర్ఎస్ ప్రభుత్వమే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి టెండర్లను ఆహ్వానించింది. కానీ కాంగ్రెస్ వచ్చిన తర్వాత పాలమూరు ప్రాజెక్టు పనులు ఎక్కడివక్కడే పెండింగ్‌లో పడిపోయాయి. తొలుత టెండర్లనే రద్దు చేసి మరింత జాప్యానికి ఒడిగట్టింది. నార్లాపూర్- ఏదుల కెనాల్‌లో మిగిలిన కొద్దిపాటి పనులను పూర్తిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తండ్లాడుతున్నది. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు మధ్య ప్యాకేజీ-3లో కేవలం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి 3.82 కి.మీ. కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కాలువ మార్గంలో పెద్ద బండరాళ్లు ఉండటంతో కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాల్సి ఉన్నది. అందుకు అంచనాలను సవరించాల్సి ఉండగా, కాంగ్రెస్ సర్కార్ సుదీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టి తుదకు అంచనాలను సవరించింది. పనులను ప్రారంభించి రెండేండ్లు గడచినా ఇప్పటికీ పూర్తిచేయలేదు. గడచిన మూడేండ్లలో రేవంత్ సర్కార్ ప్రభుత్వం పూర్తిచేసింది ఒక్క కి.మీ. కాలువ పనులే. ఇప్పటికీ నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం తీర్నాంపల్లి, కొల్లాపూర్ మండలం కుడికిళ్ల మధ్యన 2.5 కి.మీ. ఓపెన్ కెనాల్ తవ్వకం పనులు పెం డింగ్‌లోనే ఉన్నాయి. ఈ పనులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం శ్రీశైలం నుంచి ఉద్దండాపూర్ రిజర్వాయర్ వరకు కృష్ణా జలాలను ఎత్తిపోసుకొని నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. తద్వారా ఆయా రిజర్వాయర్ల పరిధిలోని గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగడంతోపాటు, నీటికరువును ఎంతో కొంతయినా అధిగమించే పరిస్థితి ఉండేది. అంతేకాదు ఏదుల, వట్టెం రిజర్వాయర్ల నుంచి కల్వకుర్తి కాలువకు నీళ్లను అందించే వెసులుబాటు కూడా ఉన్నది. తెలంగాణ సర్కార్ వైఫల్యంతో మరోవైపు శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను ఏపీ సర్కార్ యథేచ్ఛగా తరలించుకుపోతున్నది. 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం నియోజకవర్గం వరకూ కృష్ణా జలాలను తరలించింది. ప్రస్తుత కరువు పరిస్థితుల్లోనూ ఏపీ సర్కార్ ఒక్క శ్రీశైలం నుంచే 60 టీఎంసీలను మళ్లించింది. కానీ, కాంగ్రెస్ సర్కార్ కల్వకుర్తి ద్వారా కేవలం 11 టీఎంసీలను మాత్రమే మళ్లించింది. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తిచేసి ఉంటే ఆయా రిజర్వాయర్లలో కలిపి దాదాపు అదనంగా మరో 60 టీఎంసీలను నిల్వ చేసే అవకాశాన్ని కాంగ్రెస్ సర్కార్ జారవిడిచింది.

ఎప్‌స్టీన్‌తో హర్దీప్ రహస్య సమావేశం..!

వాదనను కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ ప్రశ్నించారు. తాను ఎప్‌స్టీన్‌ను ఎప్పుడూ ఒంటరిగా కలవలేదని హర్‌దీప్ పురీ చెప్పలేదా? మోదీ ఎలాంటి వ్యక్తులను ఇష్టపడతారు, తన చుట్టూ ఉంచుకోవడానికి ఎవరిని ఎంచుకుంటారు? ఆర్ఎస్ఎస్ మహిళలను ఎప్పటికీ గౌరవించదని, వారిని సమానంగా చూడదని చెప్పడానికి ఇంకేమైనా నిదర్శనం కావాలా? అని ఆమె ప్రశ్నించారు. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా కూడా కేంద్ర మంత్రి పురీపై విమర్శలు గుప్పించారు. ఎప్‌స్టీన్‌తో తాను జరిపిన సమావేశాల గురించి ఆ మంత్రి ఈ ఏడాది ప్రారంభంలో చేసిన ప్రకటనకు సంబంధించిన వీడియోను ఆమె పంచుకున్నారు.తాను ఎప్‌స్టీన్‌ను ఒక ప్రతినిధి బృందంలో భాగంగా కేవలం 3-4సార్లు మాత్రమే కలిశానని మంత్రి పురీ చెప్పారు. మరి ఈ రెండు ఫొటోల్లో మిగిలిన ప్రతినిధులంతా టేబుల్ కింద దాక్కున్నారేమో అని ఆమె చురకలు అంటించారు. ఎన్‌సీపీ(ఎస్‌పీ) ప్రతినిధి అనీష్ గవాండే ఆ ఫొటోలను దారుణమైనవిగా అభివర్ణించారు. ఒక దౌత్యవేత్త హోదాలో ఎప్‌స్టీన్‌ను ఎందుకు కలవవలసి వచ్చిందో చెప్పాలని ఆయన పురీని ప్రశ్నించారు. శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కూడా పురీ, ఎప్‌స్టీన్ ఫొటోను పంచుకుంటూ ఆ సమావేశం ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.మోదీజీ, మీ మంత్రి హర్దీప్ పురీ ఎప్‌స్టీన్‌ను ఒంటరిగా కలుస్తున్నారేమిటి? ఆయన ఎవరి సందేశాన్ని తీసుకుని ఈ భేటీకి వెళ్లారు? ఇది కేవలం ఆరంభం మాత్రమే, ముందు ముందు ఏం జరగబోతుందో చూడండి! ఆర్ఎస్ఎస్ పాలన మారబోతున్నది! అని రౌత్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి పురీ గతంలో చేసిన వ్యాఖ్యలను సీజేపీ వ్యవస్థాపకుడు దీప్కే ప్రశ్నించారు. ఒక ఫొటోతో కూడిన తన పోస్ట్‌లో ఆయన ఎప్‌స్టీన్‌తో తాను ఎప్పుడూ వ్యక్తిగతంగా సమావేశం కాలేదని పురీ చెప్పలేదా? అని నిలదీశారు. అంతర్జాతీయ శాంతి సంస్థ(ఐపీఐ) ఏర్పాటు చేసిన బహుపాక్షికవాదంపై స్వతంత్ర కమిషన్(ఐసీఎం)కు అనుబంధంగా ఉన్న ఒక ప్రతినిధి బృందంలో భాగంగా తాను వృత్తిపరమైన హోదాలో ఎప్‌స్టీన్‌ను 3 లేదా గరిష్ఠంగా 4 సార్లు కలిసినట్టు ఫిబ్రవరిలో పురీ చెప్పారు. ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారి పదవికి రాజీనామా చేసిన తర్వాత 2017లో కేంద్ర మంత్రివర్గంలో చేరకముందు ఈ సమావేశాలు జరిగాయని పురీ పేర్కొన్నారు. ఎప్‌స్టీన్‌తో తనకున్న పరిచయాలు పూర్తిగా వృత్తిపరమైనవని, ఆ అపఖ్యాతి పాలైన పెట్టుబడిదారుడిపై ఉన్న ఆరోపణలతో వీటికి ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రాలు ఒప్పుకొంటే 2029లో జమిలి ఎన్నికలు..!

ప్రకారం దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి కావడానికి రెండు నుంచి మూడు సంవత్సరాలు పడుతుంది. ఏదైనా మంత్ర దండం ఉంటే తప్ప, ఆ లోపల సాధ్యం కాదు అని ఆయన వ్యాఖ్యానించారు. జేపీసీలో మొత్తం 41 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 27 మంది లోక్‌సభ ఎంపీలు, 12 మంది రాజ్యసభ ఎంపీలు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు ఉన్నారు. నివేదికను ఎప్పుడు సమర్పిస్తారని ప్రశ్నించగా నిర్దిష్ట కాలపరిమితి ఏమీ లేదు. క్షుణ్ణంగా చర్చించి, కమిటీ సభ్యులు అంగీకరించిన తర్వాతే మేము నివేదికను సమర్పిస్తాము అని చౌదరి అన్నారు. కమిటీ తాను సందర్శించే ప్రతి రాష్ట్రానికి సంబంధించి ఒక సమగ్ర అజెండాను సిద్ధం చేసుకుంటుంది. కనీసం 500 మంది వ్యక్తులతో సమావేశమవుతుంది. కమిటీ సభ్యులను కలవదలచిన వారికి ముందే సమాచారం అంది స్తారు. గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, స్పీకర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ అధికారులు, ప్రతిపక్ష పార్టీలు, పద్మ భూషణ్ గ్రహీతలు, మీడియా ప్రతినిధులు, పౌర సమాజ సభ్యులు, అసోచామ్, ఫిక్కీ వంటి వ్యాపార సంఘాల ప్రతినిధులు వంటి వారిని కమిటీ కలుసుకుంటుంది. ఏయే రాష్ట్రాలు అంగీకరిస్తున్నాయో, ఏవి అంగీకరించడం లేదో తాము పరిశీలిస్తున్నట్టు చౌదరి చెప్పారు. అంగీకరించిన రాష్ట్రాల శాసనసభల పదవీకాలం ముగిసేలా చేసి 2029లో ఎన్నికలు నిర్వహించేలా చేస్తాము. మిగిలిన రాష్ట్రాలను 2034 నాటికి ఈ నిబంధన పరిధిలోకి తీసుకువస్తాము. అప్పటికి అవి దీనికి కట్టుబడి ఉండాల్సి ఉంటుంది. దీనికి పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. అవి అంగీకరిస్తే 2029లో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను కలిపి నిర్వహించవచ్చు అని ఆయన తెలిపారు.22 రాష్ట్రాల్లో బీజేపీ లేదా ఎన్‌డీయే ప్రభుత్వాలు ఉన్నాయి. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల మద్దతును పొందగలమని బీజేపీ ధీమాగా ఉందని, మిగిలిన రాష్ట్రాలను ఒప్పించడం కష్టతరంగా మారుతున్నదని సమాచారం. ఒక అవకాశం ఏమిటంటే 2029 నాటికి బీజేపీ పాలిత 22 రాష్ట్రాలను ఇందులో భాగస్వాములను చేసి మిగిలిన రాష్ట్రాలను 2034లో చేర్చుకోవడం. ఒక దేశం, ఒక ఎన్నికలకు ఉత్తరాఖండ్ మద్దతు ఇస్తున్నట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడం వల్ల, ముఖ్యంగా మారుమూల గ్రామాలకు చేరుకోవడంలో పెద్ద రవాణా సవాళ్లు ఎదురవుతాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కొన్ని గ్రామాలకు చేరుకోవడానికి రెండు నుంచి మూడు రోజులు పడుతుందని, తిరిగి రావడానికి కూడా అంతే సమయం పడుతుందని, ఎన్నికలను కలిపి నిర్వహించడం ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం, సీఐఐ, అసోచామ్ వంటి సంస్థలు ఈ ప్రతిపాదనను సమర్థించాయి. మహారాష్ట్ర, హర్యానా, గోవా దీనికి సానుకూలంగా స్పందించాయి. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం ప్రతికూల వ్యాఖ్యలు చేయలేదు. పంజాబ్ కూడా ప్రధాన అభ్యంతరాలు ఏవీ వ్యక్తం చేయలేదు. ఈ ప్రతిపాదనను కర్ణాటక వ్యతిరేకించింది. ఇది రాజకీయ దురుద్దేశంతో కూడిన చర్యగా అభివర్ణించిన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇది ఫెడరలిజాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. జమిలి ఎన్నికల వల్ల ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ కార్యకర్తలను పదేపదే పంపాల్సిన అవసరం తగ్గుతుందని, తద్వారా వారు తమ సాధారణ విధులపై దృష్టి పెట్టడానికి వీలవుతుందని మద్దతుదారులు భావిస్తున్నారని చౌదరి పేర్కొన్నారు.

తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు

హైదరాబాద్, అక్టోబర్ 21 : తెలంగాణలోనే అతిపెద్ద పండగ దసరా..9 రోజులు నవరాత్రి ఉత్సవాలు.. బతుకమ్మ వేడుకలతో ఈ పండగను ప్రతి ఇంటా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇక పండగ సీజన్‌లో తెలంగాణలో సాధారణంగా సుక్కా.. ముక్కా.. కామన్ అన్న సంగతి తెలిసిందే. అయితే మద్యం అమ్మకాల్లో తెలంగాణ మరోసారి సత్తా చాటినట్లు స్పష్టం అవుతోంది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2, 054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైనట్లు స్పష్టం అవుతోంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే మద్యం విక్రయాలు దాదాపు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. ఈ మేరకు మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరినట్లు తెలుస్తోంది. ఇక ముఖ్యంగా అక్టోబర్ 19 న మద్యం అమ్మకాలు భారీ స్థాయిలో జరిగాయి. ఆ ఒక్క రోజులోనే ఏకంగా రూ. 303 కోట్ల 40 లక్షల విలువైన మద్యం అమ్ముడుపోయినట్లు గణాంకాలు వివరిస్తున్నాయి.ఈ మేరకు ఈ సంఖ్య గత రికార్డులను అధిగమించినట్లు స్పష్టం అవుతోంది. అక్టోబర్ 14 న రూ. 102 కోట్ల 17 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక అక్టోబర్ 15న మద్యం డిపోలకు సెలవు కావడంతో అమ్మకాలు నమోదు కాలేదు. అలాగే అక్టోబర్ 16న రూ. 126 కోట్ల 32 లక్షలు.. అక్టోబర్ 17న రూ. 223 కోట్ల 25 లక్షల విలువైన మద్యం అమ్మకం జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ఇక అక్టోబర్ 18 న ఆదివారం సెలవు కావడంతో అమ్మకాలు తగ్గిపోయాయి. అలాగే అక్టోబర్ 19 న అత్యధికంగా రూ. 303 కోట్ల 40 లక్షల విక్రయాలు జరిగినట్లు స్పష్టం అవుతోంది. ఈ నాలుగు పని దినాల్లో మొత్తం రూ. 755 కోట్ల 14 లక్షల అమ్మకాలు నమోదైనట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ తో పోలిస్తే బీర్ల విక్రయాలు వేగంగా పెరిగినట్లు సమాచారం. గతేడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడు కాగా ఈ ఏడాది ఆ సంఖ్య 30. 37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక ఐఎంఎఫ్ఎల్ విక్రయాలు గతేడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా.. ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగినట్లు తెలుస్తోంది.



దసరా వేళ మెరుపు దాడులు.. 4పాల పిట్టలను కాపాడిన పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 21 : పాల పిట్టను తెలంగాణ రాష్ట్ర పక్షిగా ప్రభుత్వం గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ పక్షి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద ఈ పక్షిని నిర్బంధించడం, రవాణా లేదా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. అయితే హైదరాబాద్ లో దసరా సందర్భంగా ఇనుప బోనుల్లో బంధించిన 4 పాల పిట్టలను పోలీసులు మెరుపు దాడులు చేసి వాటిని కాపాడారు. వాటిని ప్రాణాలతో కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. పండగ పేరుతో మూగ ప్రాణుల స్వేచ్ఛను హరిస్తూ, స్వార్థం కోసం చిత్రహింసలకు గురిచేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇక ఇదే విషయాన్ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రస్తావించారు.ఆకాశంలో స్వేచ్ఛగా ఎగరాల్సిన తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్టను దసరా వేళ కొందరు స్వార్థం కోసం ఇనుప బోనుల్లో బంధించారు.. మూగజీవులను హింసిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని మేం ముందుగానే స్పష్టంగా హెచ్చరించినప్పటికీ.. కొందరు పెడచెవిన పెట్టి ఆ నిస్సహాయ పక్షులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. అప్రమత్తమైన పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో హైదరాబాద్ సిటీ పోలీసులు తక్షణమే స్పందించి, మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు జరిపి మొత్తం 4 పాల పిట్టలను ప్రాణాలతో కాపాడారని వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు.లంగర్ హౌస్ బాపు ఘాట్ సమీపంలోని ఆలయం వద్ద ఇరుకైన బోనుల్లో నరకయాతన అనుభవిస్తున్న రెండు పాల పిట్టలను విడిపించి కేబీఆర్ పార్క్ అటవీ అధికారులకు అప్పగించగా.. ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద చెట్టుకు బోను వేలాడదీసి నిర్బంధించిన ఒక పాల పిట్టను, అలాగే మంగళహాట్ బాలాజీనగర్ గుడి సమీపంలో బోనులో ఉంచిన మరో పాలపిట్టను రెస్క్యూ చేసి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. బాధ్యులపై అటవీశాఖ సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.పండుగ పేరుతో ఒక నిస్సహాయ పక్షిని బంధించి, ఆహార నీళ్లు లేకుండా చిత్రహింసలకు గురిచేసి చూడటం ఎవరికీ మంచి చేయదు.. ఇది మన సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ప్రాణభయంతో బోను చువ్వల మధ్య విలవిల్లాడుతున్న పక్షి రోదనలో శుభం ఎలా కనిపిస్తుంది..? నిజమైన భక్తి అంటే జీవ కారుణ్యమే తప్ప, ప్రకృతిని బందీ చేయడం కాదు. మూగ ప్రాణుల స్వేచ్ఛను హరిస్తూ, కాసుల వేటకు తెరలేపే ఇలాంటి అమానవీయ పోకడలను ఎవరూ ప్రోత్సహించవద్దు. వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ కనిపించినా వెంటనే టోల్ ఫ్రీ సంబర్లు 18004255364, 9803338666 లేదా డయల్ 112 కు సమాచారం అందించి బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని కోరుతున్నామని సజ్జనార్ పేర్కొన్నారు.



హైదరాబాద్ జూపార్క్‌లోకి వింత జంతువులు..

సడెన్ గా పెరిగిన పర్యటకులు..!

హైదరాబాద్, అక్టోబర్ 21 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఉన్న ప్రముఖ టూరిస్ట్ ప్రాంతాల్లో నెహ్రూ జూలాజికల్ పార్క్ ఒకటి. నిత్యం ఈ పార్క్ కు వందల సంఖ్యలో పర్యటకులు వస్తుంటారు. ఇక సెలవు రోజుల్లో అయితే ఆ సంఖ్య రెట్టింపు అవుతుంది. జూపార్క్ లోని రకరకాల పక్షులు, జంతువులను చూసేందుకు చిన్నా పెద్దా అని తేడా లేకుండా నిత్యం పర్యటకులతో కిటకిటలాడుతూ ఉంటుంది ఈ ప్రాంతం. అయితే నెహ్రూ జూపార్క్ లోకి కొత్త జంతువులు రానున్నాయి. జంతు ప్రేమికులకు ఇది శుభవార్త అనే చెప్పాలి. ఇక త్వరలో జూపార్క్ లోకి రానున్న ఈ కొత్త జంతువులు పర్యటకులను విశేషంగా ఆకర్షించనున్నాయి. కొత్త జంతువుల్లో కంగారూలు, వాలాబీలు, రింగ్ టెయిల్డ్ లెమూర్లు, కాసోవరీలు అంటే ఎగరలేని పక్షులతోపాటు జీబ్రాలను కూడా తీసుకురానున్నట్లు సమాచారం అందుతోంది. ఈ మేరకు ఈ జంతువులను గుజరాత్ జామ్ నగర్ లోని వంతారా అంతర్జాతీయ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నుంచి తరలించేందుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరినట్లు స్పష్టం అవుతోంది. హైదరాబాద్ జూపార్క్ లో ఇప్పటివరకూ కంగారూలు లేవనే చెప్పాలి. ఈ క్రమంలో తొలిసారిగా ఒక జంట ఆడ, మగ కంగారూలను తీసుకురానున్నారు అధికారులు. ఇక ఈ కంగారూల కోసం ప్రత్యేకంగా ఎన్ క్లోజర్, నైట్ హౌజ్ ఏర్పాట్లను అధికారులు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇక వంతారా అంతర్జాతీయ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నుంచి వచ్చిన నిపుణులు ఇప్పటికే హైదరాబాద్ జూపార్క్ లో వసతులను పరిశీలించినట్లు సమాచారం. ఈ మేరకు త్వరలోనే కంగారూలు రానున్నాయి. అయితే 2020 లో జపాన్ లోని ఓ జూపార్క్ నుంచి కంగారూలను తీసుకురావాలని ఒప్పందం కుదిరినా అదే సమయంలో కొవిడ్-19 విజృంభణ కారణంగా అది సాధ్యపడలేదని తెలుస్తోంది. కంగారూలతో పాటు వాలాబీలు కూడా హైదరాబాద్ జూపార్క్ లో సందడి చేయనున్నాయి. వీటితోపాటు మడగాస్కర్ కు చెందిన రింగ్ టెయిల్డ్ లెమూర్లు కూడా హైదరాబాద్ జూపార్క్ లోకి రానున్నాయి. అలాగే ప్రస్తుతం జూపార్క్ లో మూడు జీబ్రాలు ఉండగా.. వంతారా నుంచి మరో జంట జీబ్రాలు కూడా రానున్నట్లు స్పష్టం అవుతోంది. ఇక నెహ్రూ జూలాజికల్ పార్క్ మీర్ ఆలం ట్యాంక్ సమీపంలోని బహదూర్ పురాలో ఉంది. ఈ పార్కు దాదాపు 380 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. జూపార్కును ప్రతి సోమవారం మూసివేస్తారు. మిగతా రోజుల్లో ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంటుంది. ఇక టికెట్ ఫీజు విషయానికి వస్తే.. ప్రస్తుతం పెద్దలకు అంటే 12 సంవత్సరాల కంటే ఎక్కువ ఉన్న వారికి రూ. 100 ఉంది. అలాగే పిల్లలకు అంటే 3 నుంచి 12 సంవత్సరాల వారికి రూ. 50 గా ఉన్నట్లు సమాచారం.



ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

ఉంటే సీవియర్ (అత్యంత ప్రమాదకరస్తాయి)గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఢిల్లీ పరిధిలో పూర్ కేటగిరిలో వాయు కాలుష్యం ఉంది. ఇలాంటప్పుడు గ్రాప్-1 ఆం క్షల్ని అమలు చేస్తారు.దీనివల్ల గాలిలోకి దుమ్ము, ధూళి, కాలుష్యం తక్కువగా వెలువడుతుంది. రోడ్డుపై వాహనాలు వెలువడుతున్నప్పుడు డస్ట్ రాదు. వివిధ నిర్మాణాలు, కూల్చివేతల సందర్భంగా కూడా దుమ్ము, ధూళి వెలువడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో అధికారులు తనిఖీలు చేపడుతారు. చెత్త, ఆకులు, ఇతర వ్యర్థాల్ని బహిరంగంగా కాల్చకూడదు. కలప, బొగ్గు కాల్చకూడదు. డీజిల్ జనరేటర్లు ఎమర్జెన్సీలో మాత్రమే వాడాలి. అత్యంత వాయు కాలుష్యం వెదజల్లే వాహనాల్ని కూడా నిషేధిస్తారు. పరిశ్రమల నుంచి కూడా కాలుష్యం వెలువడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏపీలో మున్సి'పోల్స్'కు బ్రేక్

విరుద్ధమైన లేదా చట్టవిరుద్ధమైన చర్యల ద్వారా విఘాతం కలిగినప్పుడు న్యాయస్థానాలు చేతులు కట్టుకుని ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సి ఉన్నదని, ఈ అవకాశాలకు బలప్రయోగం, బెదిరింపుల్లాంటి చర్యలతో భంగం కలిగినప్పుడు కోర్టులు జోక్యం చేసుకోవచ్చని తేల్చిచెప్పింది. ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కల్పించడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం నిర్వర్తించాల్సిన ఈ రాజ్యాంగబద్ధమైన ఈ బాధ్యతకు హింస, బలప్రయోగం కారణంగా ఆటంకాలు ఏర్పడి, అభ్యర్థులకు సమాన అవకాశాలు దెబ్బతిన్నప్పుడు న్యాయ సమీక్షాధికారాన్ని పూర్తిగా పకనపెట్టలేమని పేర్కొన్నది.నామినేషన్ల దాఖలు గడువు పొడిగించాలన్న వైసీపీ అభ్యర్థనను పరిశీలించి ఈ నెల 22లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని, ఆ నిర్ణయాన్ని ప్రకటించినప్పటి నుంచి సదరు మున్సిపాలిటీల్లో 48 గంటలపాటు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించాలని ఏపీ ఎస్ఈసీకి స్పష్టం చేసింది. జిల్లా కేంద్రాల్లో నామినేషన్లపై కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని, అభ్యర్థుల తుది జాబితాను ఈ నెల 25కు వాయిదా వేయాలని సూచించింది. అభ్యర్థులకు తగిన పోలీస్ రక్షణ కల్పించాలని, నామినేషన్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతతోపాటు సీసీటీవీ ఏర్పాట్లు చేయాలని ఏపీ డీజీపీని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

పెద్దపల్లిలో రోడ్డు ప్రమాదం

చెట్టును ఢీకొట్టిన కారు.. ఆరుగురికి గాయాలు

బలగం టీవీ, పెద్దపల్లి:

పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామ సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జమ్మికుంటలో జరిగిన ఒక శుభకార్యానికి హాజరై కారు (TS 22 C 7888)లో తిరిగి వస్తున్న ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు ప్రమాదానికి గురయ్యారు.

కారు జమ్మికుంట నుంచి పెద్దపల్లి వైపు వస్తుండగా రాంపల్లి శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న ఒక స్కూటీని తప్పించబోయింది. ఈ క్రమంలో తీవ్ర అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు మరియు ఒక చిన్నారితో సహా మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ ప్రాణనష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.





దసరా ఉత్సవాల్లో కత్తితో హత్యాయత్నం.. ముగ్గురు నిందితుల అరెస్ట్

అర్బన్ కాలనీలో అమ్మవారి నిమజ్జన వేడుకల్లో ఘర్షణ

రాజేందర్‌పై కత్తితో దాడి చేసి పరారైన కిరణ్, అజయ్, జ్ఞానదీప్

కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన కోరుట్ల పోలీసులు

బలగం టీవీ, కోరుట్ల:

దసరా పండుగ సందర్భంగా దుర్గామాత నిమజ్జన వేడుకల్లో అన్యాయంగా కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ ముగ్గురు నిందితులను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోరుట్ల పట్టణ సీఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గుద్దేటి రాజేందర్ స్థానికంగా జరుగుతున్న దుర్గామాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఆ సమయంలో రామ్‌నగర్ కాలనీకి చెందిన కిరణ్, అజయ్ అనే వ్యక్తులు రాజేందర్‌తో గొడవకు దిగారు. ఆ తర్వాత బుధవారం తెల్లవారుజామున ఆ ఇద్దరు వ్యక్తులు మరో నిందితుడు జ్ఞానదీప్‌తో కలిసి మళ్లీ రాజేందర్ వద్దకు వచ్చి గొడవకు దిగారు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో వెంట తెచ్చుకున్న కత్తితో జ్ఞానదీప్ రాజేందర్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో రాజేందర్‌కు ఎడమ భుజంపై, మెడ ఎడమ వైపు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నిందితులను పట్టుకునేందుకు యత్నించగా, వారు చేతుల్లోని కత్తులతో బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తిరుపతి వెల్లడించారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి



కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ కమీషనరేట్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన కలెక్టర్, సీపీ

అక్టోబర్ 31 వరకు కమిషనరేట్ వ్యాప్తంగా సంస్మరణ వారోత్సవాలు

బలగం టీవీ, కరీంనగర్:

ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద వారు పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం అదనపు డీసీపీ వెంకటరమణ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల నామావళిని చదివి వినిపించగా, అధికారులు అమరవీరుల స్మారకార్థం గౌరవ వందనం సమర్పించారు.

శాంతిభద్రతలే అభివృద్ధికి పునాది: కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగానికి పోలీస్ శాఖ వెన్నెముక వంటిదని, శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల విద్యాభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆశయాల సాధనే నిజమైన నివాళి: సీపీ గౌష్ ఆలం

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ దేశ సమగ్రత, అంతర్గత భద్రత కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. అమరవీరుల త్యాగాలు సిబ్బందికి నిరంతరం స్ఫూర్తినిస్తాయని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నిబద్ధతతో సేవలందించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న అధికారులు, ప్రభుత్వ లబ్ధి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

31 వరకు వారోత్సవాలు

సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్, వ్యాసరచన, లఘు చిత్రాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్ ఎల్ఎండి కాలనీలో వైభవంగా రావణ దహన వేడుకలు

బలగం టీవీ, తిమ్మాపూర్:

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగే విజయదశమి అని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. దసరా వేడుకలను పురస్కరించుకుని తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని రాంలీలా మైదానంలో రావణ దహన కార్యక్రమం వైభవంగా జరిగింది. రాంలీలా కమిటీ చైర్మన్ కుంట రాజేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీఎన్జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కవ్వంపల్లి అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ పొన్నాల భూలక్ష్మి, ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డిలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, రాంలీలా ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సీపీ ఎన్. శ్వేత

హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అమరుల స్తూపం వద్ద నివాళులర్పించిన కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు

అమరవీరుల కుటుంబాలకు బహుమతులు అందజేత

బలగం టీవీ, హనుమకొండ:

విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అమరుల స్తూపం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, సీపీ ఎన్. శ్వేత అమరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

హాట్ స్ప్రింగ్స్ పోరాట స్ఫూర్తితో..

ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో వీరమరణం పొందిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది త్యాగానికి గుర్తుగా ప్రతి ఏటా ఈ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని స్మరించుకున్నారు.



నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు అంకితభావంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం

అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీపీ, వారి సమస్యలను ఆరా తీశారు. అమరుల కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబ సభ్యులకు ప్రత్యేక బహుమతులు అందజేసి గౌరవించారు.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీలు రాయల ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, పలువురు ఏసీపీలు, సీఐలు, పోలీస్ సిబ్బంది మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నవంబర్ 14 నుంచి ఢిల్లీలో 'హాట్ ఎయిర్ బెలూన్' విహారం

డిడిఏ ఆధ్వర్యంలో పర్యాటకులకు సాహస అనుభూతి

టిక్కెట్ ధరలు తగ్గించే ఆలోచనలో నిర్వాహకులు

ఆన్‌లైన్ టిక్కెటింగ్ విధానం అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు

బలగం టీవీ, న్యూఢిల్లీ:

దేశ రాజధాని ఢిల్లీ వాసులకు, పర్యాటకులకు సరికొత్త సాహస అనుభూతిని అందించేందుకు ఢిల్లీ అభివృద్ధి సంస్థ (DDA) సిద్ధమైంది. సన్‌రైజ్, సన్‌సెట్ సమయాల్లో ఆకాశంలో విహరించే 'హాట్ ఎయిర్ బెలూన్' రౌండ్లను నవంబర్ 14 నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు అధికారులు బుధవారం వెల్లడించారు.

గత ఏడాది నవంబర్‌లో సరాయ్ కాలే ఖాన్ ప్రాంతంలోని 'బానసేరా' పార్క్ వేదికగా ఈ బెలూన్ రైడ్లను తొలిసారిగా ప్రారంభించారు. ఉత్తర భారతదేశంలో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ సమయాన్ని రైడ్ల కోసం అనువైన సీజన్‌గా భావిస్తారు.

తగ్గనున్న టిక్కెట్ ధరలు

ఈ సారి ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించేందుకు టిక్కెట్ ధరలను తగ్గించే అవకాశాలు ఉన్నాయని ప్రైవేట్ నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది ఒక్కొక్కరికి దాదాపు రూ. 2,300 ధర నిర్ణయించడంతో ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీంతో కేవలం వారాంతాల్లో (వీకెండ్స్) మాత్రమే ఈ రైడ్లను నిర్వహించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పర్యాటకుల సౌకర్యార్థం, సమాచారం సులభంగా అందించేందుకు త్వరలోనే ఆన్‌లైన్ టిక్కెటింగ్ విధానాన్ని కూడా అందుబాటులోకి తేవాలని ప్లాన్ చేస్తున్నారు.

సాధారణంగా ఒక్కో బెలూన్ రైడ్‌లో నలుగురు ప్రయాణించవచ్చు. ఈ రైడ్ సుమారు 7 నుంచి 12 నిమిషాల పాటు సాగుతుంది. యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్, కామన్వెల్త్ గేమ్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అసిటూ వంటి ఇతర ప్రాంతాలకు కూడా ఈ రైడ్లను విస్తరించాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ విస్తరణ ప్రణాళికలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దసరా ట్రాఫిక్ జామ్

పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీగా నిలిచిన వాహనాలు:

సొంతూర్ల నుంచి నగర బాట పట్టిన ప్రజలు..

కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు

హైదరాబాద్ వైపు 12 టోల్ బూత్‌లు కేటాయించిన అధికారులు

రద్దీ నియంత్రణకు రంగంలోకి దిగిన పోలీసులు, టోల్ ప్లాజా సిబ్బంది

బలగం టీవీ, చౌటుప్పల్:

దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులు తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (NH-65) వాహనాల రాకపోకలతో తీవ్రంగా కిక్కిరిసిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల ప్రజలు ఒకేసారి తిరిగి బయలుదేరడంతో టోల్‌గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

ముఖ్యంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు అర కిలోమీటరుకు పైగా బారులు తీరాయి. అక్టోబర్ 22 నుంచి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానుండటంతో కుటుంబసభ్యులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావడమే ఈ రద్దీకి ప్రధాన కారణంగా మారింది.

12 టోల్ బూత్‌లు ఓపెన్.. వేగవంతంగా క్లియరెన్స్

రద్దీ తీవ్రతను తగ్గించేందుకు టోల్‌ప్లాజా యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టింది. మొత్తం ఉన్న 18 టోల్ బూత్‌లలో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాల కోసమే ప్రత్యేకంగా 12 బూత్‌లను కేటాయించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ, రహదారిపై వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో ప్రయాణికులు కొంత సమయం నిరీక్షించాల్సి వచ్చింది. దీనికి తోడు చిట్యాల, చౌటుప్పల్ వద్ద జరుగుతున్న అండర్‌పాస్, వంతెన నిర్మాణ పనుల వల్ల కూడా వాహనాల వేగం మందగించింది.



నిరంతరం పర్యవేక్షిస్తున్న పోలీసులు

పరిస్థితిని చక్కదిద్దేందుకు స్థానిక పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. కీలక కూడళ్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించి వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నారు. చిన్నపాటి ఆలస్యం మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగలేదని అధికారులు స్పష్టం చేశారు.

పండుగకు వెళ్లే సమయంలోనూ అక్టోబర్ 17న ఒక్క రోజే ఈ టోల్‌ప్లాజా నుంచి దాదాపు 52,000 వాహనాలు (నిమిషానికి సగటున 36) వెళ్లగా, తిరుగు ప్రయాణంలోనూ అదే స్థాయిలో రద్దీ కనిపిస్తోంది. బుధవారం రాత్రి వరకు ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉందని తెలిపిన అధికారులు, ప్రయాణికులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.

బెంగాల్ అసెంబ్లీలో బలపరీక్ష పెడ్తే మా బలం 275

సీఎం సువేందు అధికారి సంచలన వ్యాఖ్యలు

టీఎంసీ నుంచి గెలిచిన 64 మంది ఎమ్మెల్యేల మద్దతు కూడా మాకేనని ధీమా

కోల్‌కతా తొక్కిసలాట బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం వెల్లడి

ప్రజల ప్రత్యక్ష మద్దతుతోనే బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందని స్పష్టీకరణ

బలగం టీవీ, కోల్‌కతా:

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో బలపరీక్ష (ఫ్లోర్ టెస్ట్) నిర్వహిస్తే తమ ప్రభుత్వానికి ఏకంగా 275 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) టికెట్‌పై గెలిచిన 64 మంది శాసనసభ్యులు కూడా తమ వైపే ఉన్నారని, దీంతో తమ కూటమి బలం మరింత పెరిగి 275కి చేరుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.



కోల్‌కతాలోని చోర్‌బగాన్‌లో ఇటీవల దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన బాధితుడి కుటుంబాన్ని సీఎం సువేందు అధికారి పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ధైర్యముంటే రేపు అసెంబ్లీలో బలపరీక్ష పెట్టమనండి. మా సంఖ్య 275కి చేరుకుంటుంది" అని సవాల్ విసిరారు. బీజేపీ విజయం సోషల్ మీడియాలోనో, టీవీ చర్చల్లోనో రాలేదని, ప్రజల ప్రత్యక్ష మద్దతుతోనే సాధ్యమైందని ఆయన నొక్కి చెప్పారు.

ప్రజలు ఎన్నుకున్న సనాతన ప్రభుత్వం: సువేందు

ఈ సందర్భంగా భవానీపూర్ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఓడించిన విషయాన్ని సువేందు అధికారి గుర్తు చేశారు. తమది ప్రజలు ఎన్నుకున్న 'సనాతన' ప్రభుత్వమని అభివర్ణించారు. గత 49 ఏళ్లుగా వామపక్ష, టీఎంసీ పాలనలో రాష్ట్రంలో పేరుకుపోయిన సమస్యలన్నింటినీ తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని వెల్లడించారు.

కాగా, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ బీజేపీ ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో తలెత్తిన అంతర్గత విభేదాలు, పరిణామాల నేపథ్యంలో సీఎం సువేందు అధికారి చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ఐరాసలో భారత్ విరుచుకుపాటు

అధారాలు లేని ఆరోపణలతో నెగెటివ్ కలరింగ్ ఇవ్వొద్దని హితవు

మానవ హక్కులను రాజకీయ అస్త్రంగా మార్చవద్దని స్పష్టీకరణ

అంతరిక్షం సహకారానికే గానీ ఘర్షణలకు కాదు: ఐరాసలో ఎంపీ సుధామూర్తి

బలగం టీవీ, న్యూయార్క్/జెనీవా:

ఐక్యరాజ్యసమితి వేదికగా ధ్రువీకరించని ఆరోపణలు, అసంపూర్ణ గణాంకాల ఆధారంగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను ప్రతికూలంగా చిత్రీకరించే ప్రయత్నాలను భారతదేశం తీవ్రంగా ఖండించింది. మానవ హక్కులను రాజకీయ ఒత్తిళ్లకు లేదా కొన్ని నిర్దిష్ట దేశాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఒక సాధనంగా ఉపయోగించకూడదని గట్టిగా స్పష్టం చేసింది.

ఐరాస జనరల్ అసెంబ్లీకి చెందిన మూడో కమిటీలో 'ఎన్‌ఫోర్స్డ్ డిసప్పియరెన్సెస్ (బలవంతపు అదృశ్యాలు) వర్కింగ్ గ్రూప్' అంశంపై జరిగిన చర్చలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ బర్ఖా తమ్రకర్ పాల్గొని మాట్లాడారు.

పారదర్శకతకే మా ప్రాధాన్యం: బర్ఖా తమ్రకర్

"అంతర్జాతీయ మానవ హక్కుల యంత్రాంగాలతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. ఇటువంటి చర్చలు పరస్పర సంభాషణ, సహకారంపై ఆధారపడి ఉండాలి. ఎటువంటి పక్షపాతం లేని పారదర్శకతే మార్గదర్శక సూత్రంగా ఉండాలి. ఆధారాలు ఉన్న నిర్దిష్ట కేసులను తెలియజేయడానికి భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంది. అయితే కేవలం ఆరోపణలనే తుది తీర్పులుగా మార్చే ప్రయత్నాలను మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని బర్ఖా తమ్రకర్ స్పష్టం చేశారు.

ఇటీవల దిల్లీ నిరసనలపై ఐరాస మానవ హక్కుల నిపుణులు



వ్యక్తపరిచిన ఆందోళనలు, సీజేపీ నిరసనల వ్యవహారంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలతో గట్టి కౌంటర్ ఇచ్చింది.

అంతరిక్షంలో ఆయుధ పోటీని నివారించాలి: సుధామూర్తి

మరోవైపు ఐరాస జనరల్ అసెంబ్లీ (UNGA) మొదటి కమిటీలో భారత పార్లమెంట్ సభ్యురాలు సుధా మూర్తి కీలక ప్రసంగం చేశారు. "బాహ్య అంతరిక్షం మనందరికీ చెందుతుంది. భారత్ 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే సిద్ధాంతానికి కట్టుబడి ఉండి పనిచేస్తోంది. అంతరిక్షం అనేది కేవలం సహకారానికి వేదికగా ఉండాలి తప్ప ఘర్షణలకు కాదు" అని సుధామూర్తి పేర్కొన్నారు.

అంతరిక్షంలో ఆయుధాల పోటీని నివారించడానికి చట్టబద్ధమైన అంతర్జాతీయ ఒప్పందం అవసరమని ఆమె పిలుపునిచ్చారు. అలాగే 2023లో చంద్రుడిపై ల్యాండింగ్, మానవసహిత 'గగన్‌యాన్' మిషన్, ప్రతిపాదిత 'భారత అంతరిక్ష స్టేషన్' గురించి ప్రస్తావిస్తూ అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాలను వివరించారు.

ఏఐ ముప్పుల నివారణకు ఐరాస ప్లాన్

సైనిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడకం పెరుగుతున్న నేపథ్యంలో తలెత్తే ముప్పులను అరికట్టడానికి ఐక్యరాజ్యసమితి గురువారం ఒక సూతన అంతర్జాతీయ వేదికను ప్రారంభించనుంది. జెనీవా కేంద్రంగా పనిచేసే ఐరాస నిరాయుధీకరణ పరిశోధనా సంస్థ (UNIDIR) అధిపతి రాబిన్ గీస్ ఈ విషయాన్ని వెల్లడించారు. మానవ నియంత్రణకు అతీతంగా యంత్రాలు వ్యవహరించే పరిస్థితి రాకుండా అడ్డుకోవడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు.



కలుషిత నీరు తాగి 500 మందికి పైగా అస్వస్థత

దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియా, గెకెర్బా నగరాల్లో విరేచనాలు, కడుపునొప్పి

బాధితుల్లో అధికంగా 4 ఏళ్ల లోపు పిల్లలే

నీటి శుద్ధీకరణ నిలిపివేతపై మేయర్ రాజీనామాకు డిమాండ్


బలగం టీవీ, జోహన్నెస్‌బర్గ్

దక్షిణాఫ్రికాలో కలుషిత నీరు తాగి 500 మందికి పైగా ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తాగునీటి సరఫరా వ్యవస్థ క్షీణించడంతో ప్రిటోరియా, గెకెర్బా నగరాల్లో నూతన గ్యాస్ట్రోఎంటరైటిస్ (తీవ్ర కడుపునొప్పి, విరేచనాలు) వ్యాధి వ్యాపించినట్లు ఆ దేశ అధికారులు బుధవారం వెల్లడించారు.

రాజధాని ప్రిటోరియా తూర్పు ప్రాంతంలో సుమారు 408 మంది తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రుల పాలయ్యారు. బాధితుల్లో ఎక్కువమంది 4 ఏళ్ల లోపు చిన్నారులే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. బ్రాంక్‌హోర్స్ట్‌స్ప్రూట్ నది నుండి సేకరించిన నీటిని క్లోరినేషన్ (శుద్ధి) చేయకుండానే సరఫరా చేయడమే దీనికి ప్రధాన కారణమని అధికారులు ప్రాథమిక విచారణలో తేల్చారు. నిధులు, సరఫరా సమస్యల కారణంగా గత మూడు వారాలుగా వాటర్ ప్లాంట్‌లో క్లోరిన్ వాడటం లేదని, ఈ విషయాన్ని ప్రజలకు ముందే హెచ్చరించడంలో అధికారులు విఫలమయ్యారని ట్షానే నగర మేయర్ నాసిఫి మోయా అంగీకరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు మేయర్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు అత్యవసర ట్యాంకర్లు, బాటిల్ వాటర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మరోవైపు గెకెర్బా నగరం లోని రోడ్స్ యూనివర్సిటీకి చెందిన 111 మంది విద్యార్థులు కూడా కలుషిత నీటి వల్ల అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. నీటిని కాచి చల్లార్చి మాత్రమే తాగాలని అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.

ఉక్రెయిన్ యుద్ధం: త్రైపాక్షిక చర్చలకు పుతిన్ అంగీకారం



అమెరికా, ఉక్రెయిన్, రష్యాల మధ్య మళ్లీ శాంతి చర్చలు

నవంబర్ 10 తర్వాత సమావేశాలకు రష్యా సుముఖత

ట్రంప్ ప్రతినిధి విట్కాఫ్‌తో భేటీ అనంతరం క్రెమ్లిన్ వెల్లడి

బలగం టీవీ, మాస్కో/వాషింగ్టన్

రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉక్రెయిన్, అమెరికాలతో కలిసి త్రైపాక్షిక శాంతి చర్చలను పునఃప్రారంభించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో సెంట్ పీటర్స్‌బర్గ్‌లో బుధవారం జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం క్రెమ్లిన్ విదేశాంగ సలహాదారు యూరి ఉషాకోవ్ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.

నవంబర్ 10 తర్వాత ఈ చర్చలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని, యుద్ధం ముగిశాక రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య భద్రతా వ్యవస్థను పునర్నిర్మించడంపైనే ఈ త్రైపాక్షిక సమావేశాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయని ఉషాకోవ్ స్పష్టం చేశారు.

ఒస్లో భేటీల తర్వాత పురోగతి

ఈ భేటీకి ముందు రోజు ట్రంప్ ప్రతినిధి విట్కాఫ్, నార్వే రాజధాని ఒస్లోలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ మరియు ఐరోపా నాయకులతో సమావేశమయ్యారు. ఆ భేటీ సత్ఫలితాలనిచ్చిందని, శాంతి చర్చలలో పురోగతి కనిపిస్తోందని విట్కాఫ్ తెలిపారు. కాగా, యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి సరిహద్దులను దేని పరిధిలో దానిని 'ఫ్రీజ్' చేయడమే యుద్ధ ముగింపునకు ఏకైక మార్గమని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు.

ట్రంప్ హెచ్చరికలు – దాడుల హోరు

మరోవైపు వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ, జెలెన్‌స్కీ త్వరగా ఒప్పందానికి రాకపోతే ఉక్రెయిన్‌కు తీవ్ర నష్టం తప్పదని హెచ్చరించారు. శాంతి చర్చల ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, యుద్ధ క్షేత్రంలో దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కైవ్‌పై రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు మృతి చెందగా, రష్యా వైపు దూసుకొచ్చిన 373 ఉక్రెయిన్ డ్రోన్లను తమ వైమానిక దళాలు కూల్చివేశాయని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది.



బలోచిసాన్‌లో భీకర పోరు.. ఏడాదిలో 1100 మంది ఉగ్రవాదులు హతం

క్వెట్టాలో వెల్లడించిన బలోచిస్తాన్ హోంమంత్రి మిర్ జియావుల్లా లాంగోవ్

ఉగ్రవాద నిరోధక చర్యల కోసం రూ. 14 బిలియన్ల పెట్టుబడి

భద్రతా బలగాల ఎదురుకాల్పుల్లో 450 మందికి పైగా అరెస్ట్

బలగం టీవీ, క్వెట్టా:

పాకిస్తాన్‌లోని అత్యంత సమస్యాత్మకమైన బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో భద్రతా బలగాలు ఉగ్రవాదులపై తీవ్ర స్థాయిలో ఉక్కుపాదం మోపుతున్నాయి. గత 12 నెలల్లో భద్రతా బలగాలు నిర్వహించిన వేర్వేరు ఆపరేషన్లలో నిషేధిత ఉగ్రవాద సంస్థలు, తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ)కి చెందిన కనీసం 1,100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ఆ రాష్ట్ర హోంమంత్రి మిర్ జియావుల్లా లాంగోవ్ వెల్లడించారు. అదనపు ప్రధాన కార్యదర్శి హంజా షఫాఖత్‌తో కలిసి క్వెట్టాలో మీడియాతో ఆయన మాట్లాడారు.

గడచిన రెండేళ్లలో ఉగ్రవాద నిరోధక చర్యల కోసం రూ. 14 బిలియన్లు వెచ్చించామని, ప్రావిన్స్‌లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం దాదాపు రూ. 40 బిలియన్లు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు. గత 12 నెలల్లో సుమారు 60,000 ఆపరేషన్లు నిర్వహించి 1,100 మంది మిలిటెంట్లను మట్టుబెట్టడంతో పాటు, మరో 450 మందికి పైగా ఉగ్రవాదులను అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రాణాలు కోల్పోయిన భద్రతా సిబ్బంది

ఈ సందర్భంగా అదనపు ప్రధాన కార్యదర్శి హంజా షఫాఖత్ మాట్లాడుతూ.. ఈ ఏడాది బలోచిస్తాన్‌లో జరిగిన ఉగ్రవాద హింసాకాండలో 551 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మృతులలో 101 మంది పోలీసులు, ఇతర భద్రతా బలగాలకు చెందిన 225 మందికి పైగా సిబ్బంది ఉన్నారని వెల్లడించారు. సహజ ఖనిజాలు, గ్యాస్ సంపదతో నిండిన బలోచిస్తాన్‌లో విచ్ఛిన్నకర శక్తులను, టీటీపీని అణచివేయడానికి బలగాలు సుదీర్ఘ పోరాటం చేస్తున్నాయని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ప్రావిన్స్‌లో ఉగ్రవాద వ్యతిరేక చర్యలను ముమ్మరం చేశామని, ఉగ్రవాదాన్ని ఏ స్థాయిలోనైనా ఎదుర్కొనేందుకు భద్రతా బలగాలకు పూర్తి అధికారాలు, వనరులు సమకూర్చామని లాంగోవ్ స్పష్టం చేశారు. అలాగే, ఉగ్రవాద కేసుల్లో కఠిన శిక్షలు పడేలా విట్నెస్ ప్రొటెక్షన్ మెజర్స్, ఫేస్‌లెస్ కోర్టులు, డిటెన్షన్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. కాగా, ఇటీవలే గ్వాదర్‌లో జరిగిన ఐఈడీ పేలుడులో ఒక ఆర్మీ మేజర్ ప్రాణాలు కోల్పోగా, కలాత్ డివిజన్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు టెర్రరిస్టులు హతమైన విషయం తెలిసిందే.

కాంగోలో ఎబోలా కల్లోలం.. బంధువులపై తీవ్ర మానసిక క్షోభ

కానిస్టేబుల్ నుంచి సాధారణ పౌరుల వరకు పెరుగుతున్న డిప్రెషన్

సామాజిక బహిష్కరణ, భయంతో మానసిక చికిత్సాలయాలకు క్యూ

అంతకంతకూ పెరుగుతున్న మరణాలు.. టీకా, మందులు లేక ఇబ్బందులు

బలగం టీవీ, బునియా (కాంగో),

తూర్పు కాంగోలో ఎబోలా మహమ్మారి కోరలు చాచుతోంది. ప్రాణాంతక వైరస్‌తో పాటు సమాజంలో ఎదురవుతున్న సామాజిక బహిష్కరణ, వివక్ష కారణంగా బాధితుల కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభను ఎదుర్కొంటున్నాయి. కాంగో చరిత్రలోనే అత్యంత ఘోరమైన ఈ ఎబోలా వ్యాప్తి కారణంగా ఇప్పటివరకు 9,600 మందికి పైగా ఇన్ఫెక్షన్ సోకగా.. 4,600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ వ్యాధికి ఇప్పటివరకు ఎలాంటి ఆమోదిత వ్యాక్సిన్ లేదా నిర్దిష్ట మందు లేకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది.

కంటిమీద కునుకులేకుండా చేస్తున్న విషాదం

ఇటురి ప్రొవిన్స్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న 34 ఏళ్ల మహిళ కుటుంబంలో ఐదుగురికి ఎబోలా సోకడంతో ఆమె జీవితం తల్లకిందులైంది. చికిత్స కేంద్రంలో ఆమె సొంత అన్నయ్య, వదిన జూలైలో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదం నుంచి కోలుకోలేక, సమాజంలో ఎబోలాను ఒక 'శాపంగా' చూసే ధోరణిని తట్టుకోలేక ఆమె తీవ్ర డిప్రెషన్‌కు గురయ్యారు. చివరకు బునియాలోని 'సమేలో' మానసిక ఆరోగ్య కేంద్రాన్ని ఆశ్రయించి రెండు నెలల పాటు చికిత్స తీసుకున్నారు. ఇలాంటి ఎన్నో కుటుంబాలు భయం, ఆందోళన, ఒంటరితనంతో మానసిక సమస్యల బారిన పడుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమాజం నుంచి తీవ్ర వివక్ష

ఎబోలా లక్షణాలు కనిపించగానే చుట్టుపక్కల వారు, పొరుగువారు పూర్తిగా దూరం పెడుతున్నారని బాధితులు వాపోతున్నారు. వ్యాధి సోకిన కుటుంబాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో వారు అభద్రతాభావానికి లోనవుతున్నారు. మరోవైపు, మరణించిన వారి అంత్యక్రియలను కూడా వారి సంప్రదాయం ప్రకారం నిర్వహించుకునే అవకాశం లేకపోవడం కుటుంబ సభ్యులకు తీరని క్షోభను



మిగులుస్తోంది.

బునియాలోని ఒక్క మానసిక ఆరోగ్య కేంద్రానికే ఎబోలా కారణంగా సుమారు 350 మందికి పైగా బాధితులు క్యూ కట్టారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దశాబ్దాలుగా తిరుగుబాటుదారుల హింసతో అల్లాడుతున్న తూర్పు కాంగో ప్రజలకు ఈ ఎబోలా వ్యాప్తి మరింత క్షోభను మిగులుస్తోందని 'డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' మానసిక నిపుణురాలు మిరెల్లా రికార్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైద్య సేవలతో పాటు బాధితులకు మానసిక కౌన్సెలింగ్ అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని నిపుణులు కోరుతున్నారు.



ఆఫ్రికాలో వ్యాపిస్తున్న ఎబోలా..

కాంగో దాటి 4 దేశాలకు పాకిన ప్రాణాంతక వైరస్

నైజీరియా, కెన్యాలో కొత్త కేసులు.. నైజీరియాలో తొలి కేసు నమోదు

చరిత్రలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఎబోలాగా డబ్ల్యూహెచ్ఓ ప్రకటన

బలగం టీవీ, అబుజా (నైజీరియా):

కాంగోలో తీవ్ర కలకలం సృష్టిస్తున్న ప్రాణాంతక ఎబోలా మహమ్మారి ఆఫ్రికా ఖండంలో వేగంగా విస్తరిస్తోంది. కాంగో సరిహద్దులు దాటి మరో నాలుగు దేశాలకు ఈ వైరస్ వ్యాపించింది. ఆఫ్రికాలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాలలో గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఎబోలా వ్యాప్తి చెందుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఆందోళన వ్యక్తం చేసింది.

అమోదిత వ్యాక్సిన్ గానీ, సరైన ప్రామాణిక మందులు గానీ లేని అరుదైన 'బుండిబుగ్యో' (Bundibugyo) రకం వైరస్ కారణంగా కాంగోలో ఇప్పటివరకు 9,500 మందికి పైగా ఇన్ఫెక్షన్ సోకగా, కనీసం 4,600 మంది ప్రాణాలు కోల్పోయారు. నిఘా లోపం, ప్రయాణీకుల ద్వారా అలస్యంగా వ్యాధి నిర్ధారణ కావడం వైరస్ విస్తరణకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.

వివిధ దేశాల్లో ఎబోలా ప్రస్తుత పరిస్థితి:

నైజీరియా: రాజధాని అబుజాలో తొలి ఎబోలా కేసు నమోదైంది. ఉగాండా నుంచి రెండు వారాల క్రితం వచ్చిన ఒక మహిళలో అక్టోబర్ 7న లక్షణాలు కనిపించగా, అక్టోబర్ 11న ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించిన తర్వాత ఎబోలాగా నిర్ధారణ అయింది. బాధితురాలితో సంబంధం ఉన్న 44 మంది కాంటాక్టులను అధికారులు గుర్తించి క్వారంటైన్‌కు తరలించారు.

కెన్యా: అక్టోబర్ 6న నైరోబీలో తొలి కేసు నమోదైంది. కాంగో నుంచి ఉగాండా మీదుగా వచ్చిన వ్యక్తికి వ్యాధి సోకి మరణించాడు. ప్రస్తుతం కేసుల సంఖ్య 9కి చేరగా, 135 మంది కాంటాక్టులను క్వారంటైన్‌లో ఉంచారు.

ఉగాండా: మే నెలలో కాంగో నుంచి వచ్చిన వ్యక్తుల ద్వారా 20 కేసులు నమోదు కాగా, ఇద్దరు మరణించారు. 42 రోజుల లెక్కింపు అనంతరం ఆగస్టు 27న ఉగాండా ఎబోలా రహిత దేశంగా ఆమోదం పొందింది. ప్రస్తుతం అక్కడ కొత్త కేసులు ఏవీ లేవు.

ఫ్రాన్స్: ఆఫ్రికా అవతల ఈ మహమ్మారి నమోదు కావడం ఫ్రాన్స్‌లోనే తొలిసారి. కాంగోలో మానవతా దృక్పథంతో సేవలందించి తిరిగొచ్చిన ఒక వైద్యుడికి జూన్‌లో ఎబోలా సోకగా, జూలై 4 నాటికి చికిత్స పొంది పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు.

వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల భారీ నిరసన ప్రదర్శన



గ్రీస్ రాజధానిలో పెరుగుతున్న జీవన వ్యయం, విద్యారంగంలో నిధుల కొరతపై కదం తొక్కిన వైనం

అఫోర్డబుల్ హౌసింగ్, ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని డిమాండ్

యూరప్ అంతటా వ్యాపిస్తున్న నిరసనల అగ్గి

బలగం టీవీ, ఏథెన్స్:

గ్రీస్ రాజధాని ఏథెన్స్ వీధుల్లో వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు సరసమైన ధరల్లో వసతి కల్పించాలని, విద్యారంగంలో ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేస్తూ వారు రోడ్డెక్కారు. ప్రస్తుతం యూరప్ అంతటా వ్యాపిస్తున్న నిరసనల అల గ్రీస్‌కు కూడా పాకింది. ఏథెన్స్‌తో పాటు ఉత్తర నగరమైన థెస్సలో □○ ○□, పశ్చిమ నౌకాశ్రయ నగరమైన పాత్రాస్‌లోనూ ఇలాంటి నిరసనలే వెల్లువెత్తాయి.


ఇంధన ధరలు పెరగడం, జీవన వ్యయం విపరీతంగా భారం కావడం, పాఠశాలల దుస్థితి, విద్యార్థులకు తగిన వసతి లేకపోవడం వంటి సమస్యలు యూరప్ వ్యాప్తంగా ఆగ్రహాన్ని రగుల్కొంటున్నాయి. ముఖ్యంగా ఫ్రాన్స్, ఇటలీ, అల్బేనియా దేశాల్లో జరిగిన ప్రదర్శనలు తీవ్ర హింసాత్మకంగా మారాయి. "గ్రీస్ నుంచి ఫ్రాన్స్ వరకు.. విద్యకు నిధులు కేటాయించండి" అని రాసి ఉన్న బ్యానర్లు ఏథెన్స్ నిరసనలో ప్రత్యేక □□ గా నిలిచాయి. అలాగే "చదువుకోవాలా లేక బతకాలా?" (To study or to survive) అని ఫ్రెంచ్ భాషలో ఉన్న అట్టముక్కలను విద్యార్థులు ప్రదర్శించారు.

ప్రభుత్వ విధానాలపై విద్యార్థుల మండిపాటు

పెరుగుతున్న జీవన వ్యయాన్ని ఎదుర్కొనేందుకు సంప్రదాయవాద ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని 20 ఏళ్ల ఇంజనీరింగ్ విద్యార్థి పనగోటిస్ మోస్కోనాస్ విమర్శించారు. "ప్రభుత్వం ఎవరో ఒకరికి సహాయం చేస్తున్నట్లు చెబుతోంది. నెలకు 120 యూరోల (సుమారు 135 డార్లు) అద్దె రాయితీ ఇస్తారట. అది కనీసం అర్ధ నెల అద్దెకు కూడా సరిపోదు. పైగా ఆ డబ్బును ఏడాది చివర్లో ఇస్తున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరసన ప్రదర్శన నేపథ్యంలో అల్లర్లు నియంత్రించే పోలీసులు భారీగా మోహరించి మార్చ్‌ను నీడలా అనుసరించారు. ప్రదర్శన ప్రాంతానికి వస్తున్న వారిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రీస్‌లో ప్రదర్శనలు తరచూ హింసాత్మకంగా మారుతుండటంతో.. మార్గమధ్యంలోని దుకాణాలు, కేఫ్‌లు తమ కిటికీల రక్షణ కోసం స్టీల్ షట్టర్లను దించేశాయి. ఉపాధ్యాయులు బుధవారం సమ్మెకు పిలుపునిచ్చినప్పటికీ కొన్ని పాఠశాలలు మాత్రం తెరిచే ఉన్నాయి.

"మా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. రోజువారీ ఖర్చులు భరించలేక, నెలాఖరు వరకు నెట్టుకురావడం కష్టమవుతోంది. ఏటా క్షీణిస్తున్న పాఠశాలల పరిస్థితిని నిరసిస్తూ మేం ఈరోజు సమ్మెకు దిగాం" అని ఉపాధ్యాయుడు ఇవాన్నిస్ రోంపాస్ ఆవేదన వ్యక్తం చేశారు.





ఫ్రెంచ్ ఓపెన్.. చెమటోడ్చి గెలిచిన సింధు

ఉత్కంఠ పోరులో సుపనిదాపై విజయం

తరువాతి రౌండ్‌కు దూసుకెళ్లిన భారత స్టార్ షట్లర్

శ్రీకాంత్‌పై ఆయుష్ శెట్టి సంచలన విజయం

బలగం టీవీ, పారిస్

ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి. సింధు కష్టపడి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ఉత్కంఠ పోరులో మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధు 21-14, 8-21, 23-21 తేడాతో థాయిలాండ్‌కు చెందిన ప్రపంచ 26వ ర్యాంకర్ సుపనిదా కతేథాంగ్‌పై విజయం సాధించింది. గంటా నాలుగు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఆఖరి వరకు ఇరు క్రీడాకారిణులు ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు.

తొలి గేమ్‌ను 21-14తో సునాయసంగా గెలుచుకున్న సింధుకు, రెండో గేమ్‌లో థాయ్ ఆటగాడు బలమైన షాట్లతో పుంజుకుని 8-21తో గట్టి షాక్ ఇచ్చింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఒకానొక దశలో మ్యాచ్ ఎటువైపు మొగ్గుతుందో తెలియని పరిస్థితుల్లో, ఒత్తిడిని జయించిన సింధు 23-21తో గేమ్ సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది.

సహనంతో ఆడి గెలిచా: సింధు

మ్యాచ్ అనంతరం సింధు మాట్లాడుతున్నా – "కొన్ని మ్యాచ్‌లలో ఆట తీరు కంటే విజయం సాధించడమే ముఖ్యం. సుపనిదా ప్రతి పాయింట్ కోసం నన్ను తీవ్రంగా శ్రమించేలా చేసింది. ఆఖరి ఘట్టంలో షటిల్ లైన్‌ను తాకిన వేళ దేవుడు నన్ను పరీక్షించాడనిపించింది. ఈ విజయం నాకు ఎంతో అవసరం. కొన్ని పొరపాట్లను సమీక్షించుకుని మరుసటి మ్యాచ్‌కు సిద్ధమవుతా" అని తెలిపింది.

మిగతా మ్యాచ్‌ల వివరాలు:

పురుషుల సింగిల్స్: భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనం సృష్టించాడు. సీనియర్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్‌ను 19-21, 21-16, 21-12 తేడాతో ఓడించి తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించాడు.

లక్ష్యసేన్ నిష్క్రమణ: ఫామ్‌లేమితో బాధపడుతున్న భారత టాప్ షట్లర్ లక్ష్యసేన్ జపాన్ ఆటగాడు కొడాయ్ నరోకాకు 'వాకోవర్' ఇవ్వడంతో టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

ఉన్నతి హుడా ఓటమి: మహిళల సింగిల్స్‌లో యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా 18-21, 21-12, 17-21 తేడాతో జపాన్‌కు చెందిన రికో గుంజీ చేతిలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.



చెన్నై ఓపెన్ మెయిన్ డ్రాలో వైష్ణవి, సహజ, మాయకు చోటు

వైల్డ్‌కార్డులు దక్కించుకున్న ముగ్గురు భారత టెన్నిస్ క్రీడాకారిణులు

బలగం టీవీ, న్యూఢిల్లీ:

డబ్ల్యూటీఏ చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ మెయిన్ డ్రాలోకి ప్రవేశించేందుకు భారత నంబర్‌వన్ సింగిల్స్ క్రీడాకారిణి వైష్ణవి అడ్కర్, సహజ యమలపల్లి, యువ క్రీడాకారిణి మాయ రాజేశ్వరన్ రేవతికి వైల్డ్‌కార్డులు లభించాయి. బుధవారం నిర్వాహకులు ఈ విషయాన్ని ప్రకటించారు.

17 ఏళ్ల మాయ ఇటీవల పోర్చుగల్‌లో జరిగిన డబ్ల్యూ35 టోర్నీలో సింగిల్స్, డబుల్స్ టైటిళ్లను గెలుచుకుని మంచి ఫామ్‌లో ఉంది. మరో వైల్డ్‌కార్డును 21 ఏళ్ల అమెరికన్ క్రీడాకారిణి కేథరిన్ హుయ్ దక్కించుకుంది. ఆమె 2023 యూఎస్ ఓపెన్ జూనియర్ ఛాంపియన్.

తమిళనాడు టెన్నిస్ సంఘం అధ్యక్షుడు విజయ్ అమృత్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక డబ్ల్యూటీఏ 250 టోర్నీలో స్వదేశీ పరిస్థితులను సద్వినియోగం చేసుకుని వైష్ణవి, సహజ, మాయ మంచి ప్రదర్శన చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

అంతరాతీయ మాస్టర్స్ వరల్డ్ కప్‌కు పాక్ జట్టుకు అనుమతి నిరాకరణ

భద్రత, వీసా హామీలు ఉన్నప్పటికీ పయానానికి నో

మంత్రి మొహసిన్ నఖ్వీ ఆదేశాలతో వెనక్కి తగ్గిన పీవీసీఏ

బలగం టీవీ, కరాచీ

భారత్ వేదికగా వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న ఇంటర్నేషనల్ మాస్టర్స్ క్రికెట్ వరల్డ్ కప్ (50 ఏళ్లు పైబడిన ఆటగాళ్ల టోర్నీ)లో పాల్గొనేందుకు పాకిస్థాన్ జట్టుకు ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిరాకరించింది. శ్రీలంకలో గత జరిగిన టోర్నీలో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. అయితే ఈసారి భారత్‌లో జరిగే టోర్నీకి వెళ్లేందుకు తమ జట్టుకు అనుమతి లేదని పీసీబీ స్పష్టం చేసింది.

ఈ విషయమై పాకిస్థాన్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ (పీవీసీఏ) చీఫ్ ఫవాద్ ఇజాజ్ బుధవారం మాట్లాడుతూ – "మేము టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు నిర్వాహకులకు సమాచారం అందించాము. దీనివల్ల వారు ప్రత్యామ్నాయ జట్టును ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది" అని తెలిపారు.

భద్రతా హామీ ఉన్నా...

భారత్‌లో పర్యటించేందుకు వీసాలు, అత్యున్నత స్థాయి భద్రత కల్పిస్తామని నిర్వాహకులు, ఆతిథ్య దేశం తమకు హామీ ఇచ్చాయని ఫవాద్ ఇజాజ్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే తాము పీసీబీతో పాటు విదేశాంగ, అంతర్గత మంత్రిత్వ శాఖలను అనుమతి కోరినట్లు వెల్లడించారు. అయితే, పీసీబీ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ అంతర్గత మంత్రి మొహసిన్ నఖ్వీ స్పందిస్తూ.. భారత్‌లో ఆడేందుకు అనుమతి లేదని తేల్చిచెప్పినట్లు ఆయన వెల్లడించారు.

ఇటీవల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు భారత్‌కు వచ్చేందుకు పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ కూడా నిరాకరించగా, ఆమె స్థానంలో బంగ్లాదేశ్ బరిలోకి దిగిన విషయం తెలిసిందే. రెండు దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల కారణంగా.. భారత్-పాకిస్థాన్ జట్లు ప్రస్తుతం కేవలం తటస్థ వేదికలు లేదా బహుళ దేశాల టోర్నీలలో మాత్రమే తలపడుతున్నాయి.

అహ్మదాబాద్ వేదికగా తొలి కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్

అక్టోబర్ 23 నుంచి 31 వరకు ఘనంగా టోర్నీ నిర్వహణ

పోటీపడనున్న 13 దేశాలు.. 400 మందికి పైగా అథ్లెట్లు

భారత పురుషుల జట్టు కెప్టెన్‌గా సుర్జీత్ సింగ్, మహిళల జట్టుకు నిధి శర్మ

బలగం టీవీ, అహ్మదాబాద్

కబడ్డీ క్రీడా చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. తొలి కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌నకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదిక కానుంది. అక్టోబర్ 23 నుంచి 31 వరకు తొమ్మిది రోజుల పాటు సాగనున్న ఈ మెగా టోర్నీ వివరాలను నిర్వాహకులు బుధవారం జరిగిన కర్టెన్-రైజర్ కార్యక్రమంలో అధికారికంగా వెల్లడించారు.

అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (AKFI) ఆధ్వర్యంలో, ఇంటర్నేషనల్ కబడ్డీ ఫెడరేషన్ (IKF) అనుమతితో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో మొత్తం 23 జట్లు, 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొననున్నారు. మొత్తం 62 మ్యాచ్‌లు జరుగనున్నాయి. భారత్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, నైజీరియా, కెన్యా, టాంజానియా, కెనడా, సింగపూర్, మలేషియా, ఉగాండా, ఇంగ్లండ్, స్కాట్లాండ్ మరియు ఆస్ట్రేలియా దేశాలు ఈ టోర్నీలో బరిలోకి దిగుతున్నాయి.ఈ చారిత్రక టోర్నీలో పాల్గొనే భారత పురుషుల జట్టుకు సుర్జీత్ సింగ్ నాయకత్వం వహించనుండగా, మహిళల జట్టుకు నిధి శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

లీగ్ మ్యాచ్‌ల అనంతరం అక్టోబర్ 30న రెండు విభాగాల్లో సెమీఫైనల్స్ జరుగనుండగా.. అక్టోబర్ 31న ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి విజేతలను తేల్చనున్నారు."అహ్మదాబాద్ వేదికగా తొలి కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించడం భారత కబడ్డీ రంగానికి ఎంతో గర్వకారణమైన క్షణం" అని ఏకేఎఫ్ఐ కార్యదర్శి జితేంద్ర ప్రణాన్ సింగ్ ఠాకూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పారా ఆసియా క్రీడల్లో భారత్ విజృంభణ

ఒక్క రోజే 5 స్వర్ణాలతో సహా 18 పతకాలు

సిమ్రాన్, ప్రవీణ్, సచిన్ ఖిలారీ గేమ్స్ రికార్డులు

మొత్తం 62 పతకాలతో ఐదో స్థానంలో టీమిండియా

బలగం టీవీ, హాంగ్‌జౌ

ఆసియా పారా క్రీడల్లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో అలరిస్తున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పతకాల వేట కొనసాగిస్తూ దేశాన్ని పతకాల పట్టికలో ఐదో స్థానానికి చేర్చారు. బుధవారం ఒక్కరోజే అథ్లెటిక్స్‌లో 5 స్వర్ణాలతో కలిపి మొత్తం 18 పతకాలు సాధించి సత్తా చాటారు. భారత అథ్లెట్లు సిమ్రాన్, ప్రవీణ్ కుమార్, సచిన్ ఖిలారీ తమ విభాగాల్లో నూతన గేమ్స్ రికార్డులు నమోదు చేయడం విశేషం. దీంతో భారత్ ఖాతాలో మొత్తం పతకాల సంఖ్య 62కు చేరుకుంది.





అథ్లెటిక్స్‌లో పసిడి పంట

దృష్టిలోపం ఉన్న భారత స్ప్రింటర్ సిమ్రాన్ మహిళల 100 మీటర్ల (టీ12) విభాగంలో 12.02 సెకన్లలో లక్ష్యాన్ని చేరి గేమ్స్ రికార్డుతో స్వర్ణం సాధించింది. అంతకుముందు 200 మీటర్ల విభాగంలోనూ పసిడి నెగ్గిన సిమ్రాన్, 24 గంటల వ్యవధిలోనే రెండు స్వర్ణాలు, రెండు గేమ్స్ రికార్డులతో మెరిసింది.

పురుషుల హైజంప్ (టీ44/64)లో ప్రవీణ్ కుమార్, షాట్‌పుట్ (ఎఫ్46)లో సచిన్ ఖిలారీ, షాట్‌పుట్ (ఎఫ్53)లో ఆయుశ్ వర్మ భారత్‌కు స్వర్ణాలు అందించారు. పురుషుల 100 మీటర్ల (టీ46/47) సంయుక్త విభాగంలో దిలీప్ గవిట్ విజేతగా నిలిచి పసిడి కైవసం చేసుకున్నాడు.

రజతాలు, కాంస్యాల మెరుపులు

రజత పతకాలు: బంటి (హైజంప్ టీ44/64), భాగ్యశ్రీ జాదవ్ (మహిళల షాట్‌పుట్ ఎఫ్34), మహమ్మద్ యాసర్ (షాట్‌పుట్ ఎఫ్46), మంజీత్ (జావెలిన్ త్రో ఎఫ్12/13), మహ్మద్ మొర్సింగనకత్ బాసిల్ (100 మీటర్లు టీ46/47 - గేమ్స్ రికార్డు) రజతాలు సాధించారు.

కాంస్య పతకాలు: అనుభవ్ చౌధరి (100 మీటర్లు టీ35), పర్వీన్ (షాట్‌పుట్ ఎఫ్46), రాకేష్‌భాయ్ భట్ (100 మీటర్లు టీ37) కాంస్యాలు గెలుపొందారు.



ఇతర క్రీడల్లోనూ పతకాల హోరు

పారా ఆర్చరీ: శీతల్ దేవి - పాయల్ నాగ్ జోడీ మహిళల డబుల్స్‌లో రజతం సాధించింది.

పారా స్విమ్మింగ్: రవి కార్తిక్ బుడిగిన (100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఎస్13) రజతం గెలవగా, హిమాంశు నందల్ (బ్రెస్ట్‌స్ట్రోక్ ఎస్‌బీ13) కాంస్యం సాధించాడు.

పవర్‌లిఫ్టింగ్: మహిళల 67 కిలోల విభాగంలో కస్తూరి రాజమణి రజత పతకం సొంతం చేసుకుంది.

ఇక పారా బ్యాడ్మింటన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సుహాస్ ఎల్‌వై, నవీన్ శివకుమార్, అభిజీత్ సఖూజా సెమీఫైనల్స్‌కు చేరడంతో భారత్‌కు మరో మూడు పతకాలు ఖాయమయ్యాయి. ఇప్పటివరకు భారత్ సాధించిన 14 స్వర్ణాల్లో 13 అథ్లెటిక్స్ నుంచే రావడం గమనార్హం. ప్రస్తుతం భారత్ 14 స్వర్ణాలు, 22 రజతాలు, 26 కాంస్యాలతో పతకాల పట్టికలో ఐదో స్థానంలో ఉంది.







వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు కష్టం

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

నిలకడగా రాణిస్తున్న ఓపెనర్లు అభిషేక్, సంజూ

యువ ఆటగాడికి ఇంకా సమయం ఉందన్న కెప్టెన్

న్యూజిలాండ్‌తో గురువారం నుంచి టీ20 సిరీస్ ప్రారంభం

బలగం టీవీ, క్రైస్ట్‌చర్చ్:

న్యూజిలాండ్‌తో గురువారం నుంచి ప్రారంభం కానున్న ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత బృందం క్రైస్ట్‌చర్చ్ చేరుకుంది. అయితే ఈ సిరీస్‌లో యువ డాషింగ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తుది జట్టులో స్థానం సంపాదించడం కష్టమని టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు. మ్యాచ్‌కు ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రస్తుతం భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారని, ఆ ఇద్దరి జోడీ చెలరేగి ఆడుతోందని శ్రేయస్ తెలిపారు. ఇలాంటి సమయంలో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కడం కష్టమేనని అన్నారు. ఇటీవలి కాలంలో ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లకు కూడా సూర్యవంశీని ఎంపిక చేసినప్పటికీ, గత 21 మ్యాచ్‌లలో అతను కేవలం 8 మ్యాచ్‌లలో మాత్రమే ఆడాడని గుర్తుచేశారు. ఈ ఏడాది ఆరంభంలో భారత్ వరల్డ్‌కప్ గెలవడంలో ఈ ఓపెనింగ్ జోడీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

డ్రెస్సింగ్ రూమ్ అనుభవం ముఖ్యం

సూర్యవంశీ లాంటి టాలెంటెడ్ ప్లేయర్లు డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్లతో గడపడం చాలా ముఖ్యమైన అంశమని అయ్యర్ అభిప్రాయపడ్డారు. "అతను చాలా చిన్న వయస్కుడు. అవకాశాలు రావడానికి అతనికి ఇంకా చాలా సమయం ఉంది. ప్రస్తుతం అతను నేరుగా జట్టులోకి రాలేదు; ఎందుకంటే మన ఓపెనర్లు నిలకడగా రాణిస్తూ జట్టుకు విజయాలు అందిస్తున్నారు" అని అన్నారు. ఆసియా క్రీడల్లో మాత్రం సూర్యవంశీకి అవకాశం దక్కిందని, ఆ కారణంగా సంజు శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇలాంటి విదేశీ పర్యటనలు యువ ఆటగాళ్లకు పిచ్‌లు, పరిస్థితులకు అలవాటు పడేందుకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.





కివీస్ గడ్డపై సవాళ్లు

స్వదేశంలో ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన తమ జట్టు, ఇప్పుడు పేస్ ఫ్రెండ్లీ పిచ్‌లపై ఆడేందుకు సిద్ధం కావాలని శ్రేయస్ అన్నారు. న్యూజిలాండ్‌లో ఉండే చల్లటి వాతావరణాన్ని తట్టుకోవడం కూడా ముఖ్యమేనని తెలిపారు. ఇక్కడి పరిస్థితులను గమనిస్తే వాతావరణం ఫాస్ట్ బౌలింగ్‌కు సహకరిస్తుందని, కివీస్ జట్టుకు స్వదేశీ అడ్వాంటేజ్ ఉంటుందని పేర్కొన్నారు. ఇక తాను మూడో నెంబర్ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నానని, బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు వెళ్లాలనే ఆలోచన ప్రస్తుతానికి లేదని స్పష్టం చేశారు.

హిమాచల్‌పై ముంబై ఘన విజయం

ఇన్నింగ్స్ 97 పరుగుల తేడాతో ముంబై జయం

రెండు వరుస బోనస్ పాయింట్లు సాధించిన డిఫెండింగ్ ఛాంపియన్

రాణించిన మోహిత్ అవస్థి (5/44)

బలగం టీవీ, బిలాస్‌పూర్ (హిమాచల్ ప్రదేశ్):

రంజీ ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్‌లో ముంబై జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగించింది. లూహ్ను క్రికెట్ మైదానంలో బుధవారం ముగిసిన మ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్‌పై ముంబై ఇన్నింగ్స్ 97 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. చివరి రోజు రెండో సెషన్ వరకు హిమాచల్ పోరాడినప్పటికీ, ముంబై బౌలర్ల దాటికి చివరికి ఆలౌటైంది. ఈ విజయంతో ముంబై వరుసగా రెండో బోనస్ పాయింట్‌ను ఖాతాలో వేసుకుంది.

పోరాడిన మన్, కాల్తా

ఫాలోఆన్ ఆడుతూ 388 పరుగుల భారీ లోటుతో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హిమాచల్ ప్రదేశ్ జట్టు ఓటమిని ఆలస్యం చేసేందుకు గట్టిగానే ప్రయత్నించింది. కెప్టెన్ పుఖ్‌రాజ్ మన్ (50; 126 బంతుల్లో, 6 ఫోర్లు), వైభవ్ కాల్తా (63; 169 బంతుల్లో, 10 ఫోర్లు) బాధ్యతాయుతమైన అర్ధ శతకాలతో పోరాడారు. నాలుగో వికెట్‌కు ఈ జోడీ విలువైన 85 పరుగులు జోడించి ముంబైని కొంతసేపు ఒత్తిడికి గురిచేసింది.

అయితే, తుషార్ దేశ్‌పాండే పుఖ్‌రాజ్ మన్‌ను అవుట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత మోహిత్ అవస్థి పట్టుదలగా ఆడుతున్న వైభవ్ కాల్తాను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చాడు. పిచ్ నుంచి పెద్దగా సహకారం లభించకపోయినప్పటికీ, ముంబై బౌలర్లు క్రమశిక్షణతో బంతులేసి హిమాచల్ ఇన్నింగ్స్‌ను 291 పరుగులకు కుప్పకూల్చారు.

మెరిసిన మోహిత్ అవస్థి

ముంబై బౌలర్లలో పేసర్ మోహిత్ అవస్థి అద్భుతంగా రాణించి 44 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు (5/44) పడగొట్టాడు. అతనికి తోడుగా ఎడమచేతి వాటం స్పిన్నర్ షామ్స్ ములానీ కీలక సమయంలో వికెట్లు తీసి హిమాచల్ కోలుకోకుండా దెబ్బతీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ లోటును పూడ్చుకోవడంలో విఫలమైన హిమాచల్ ప్రదేశ్, రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది.

ఈ విజయంతో ముంబై మరోసారి పూర్తిస్థాయిలో 7 పాయింట్లను సాధించగా, వరుసగా రెండో ఓటమిని చవిచూసిన హిమాచల్ ప్రదేశ్ గ్రూప్-డి పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది.

సౌతాఫ్రికాపై ఆస్ట్రేలియా పోరాటం

రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబాటు.. ఇంకా 170 పరుగుల వెనుకంజలో ఆసీస్

మార్కో జాన్సెన్ (5/33) ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 99 పరుగులకే ఆలౌట్

అజేయ అర్ధశతకంతో ఆదుకున్న ట్రావిస్ హెడ్ (87 నాటౌట్)

బలగం టీవీ, గెకెర్బా (సౌతాఫ్రికా):

సౌతాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఓటమిఛాయల్లో చిక్కుకుంది. నాల్గో రోజు ఆట ముగిసేసరికి ఆసీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టు ఇంకా 170 పరుగుల వెనుకంజలో ఉంది. క్రీజులో ట్రావిస్ హెడ్ (87 నాటౌట్), నైట్‌వాచ్‌మన్‌గా స్కాట్ బోలండ్ (2 నాటౌట్) ఉన్నారు.

తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలిన ఆసీస్

సౌతాఫ్రికా తన తొలి ఇన్నింగ్స్‌ను 425/9 వద్ద డిక్లేర్ చేయగా.. బదులుగా బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు సౌతాఫ్రికా పేసర్ మార్కో జాన్సెన్ (5/33) ఉచ్చులో చిక్కుకుని కేవలం 99 పరుగులకే కుప్పకూలింది. ఇది ఆస్ట్రేలియా టెస్ట్ చరిత్రలో నాలుగో అత్యల్ప ఇన్నింగ్స్ స్కోరు కావడం గమనార్హం. సౌతాఫ్రికా భారీ ఆధిక్యం (326 పరుగులు) సాధించడంతో ఆసీస్‌పై ఫాలోఆన్ అమలు చేసింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో స్మిత్ (28) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ప్రొటీస్ బౌలర్లలో రబాడ, ముల్డర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



ట్రావిస్ హెడ్ ఒంటరి పోరాటం

ఫాలోఆన్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్‌కు కూడా ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ నిక్ మాడిసన్ (8) త్వరగానే పెవిలియన్ చేరాడు. ఈ క్లిష్ట సమయంలో మరోసారి విఫలమవుతున్న దశలో.. ట్రావిస్ హెడ్ (138 బంతుల్లో 9 ఫోర్లతో 87 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. లబుషేన్ (36)తో కలిసి రెండో వికెట్‌కు 92 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు.

అయితే ఆ తర్వాత లబుషేన్, మాట్ రెన్షా (11), బ్యూ వెబ్‌స్టర్ (0) తక్కువ పరుగులకే అవుట్ కావడంతో ఆసీస్ మరోసారి కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో తలకు బంతి తగడంతో గాయపడిన స్టీవ్ స్మిత్ బ్యాటింగ్‌కు రాలేదు. సౌతాఫ్రికా బౌలర్లలో రబాడ రెండు వికెట్లు తీయగా, హార్మర్ ఒక వికెట్ దక్కించుకున్నారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ తొలి టెస్ట్ గెలిచి 1-0 ఆధిక్యంలో కొనసాగుతుండగా, ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ సమం చేయాలని ప్రొటీస్ పట్టుదలగా ఉంది.